నవతెలంగాణ 1
మన తెలుగు దినపత్రిక
మెదక్
శుక్రవారం | 19 జనవరి 2024 | www.navatelangana.com

మర్రిముస్త్యాల ప్రభుత్వ పాఠశాలలో డీఈఓ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ - కొమురవెల్లి

మండలంలోని జడ్పీహెచ్ఎస్ మర్రిముస్త్యాల పాఠశాలను డీఈఓ ఈ శ్రీనివాస్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల వివిధ సామర్థ్యాల ఉన్నతి, ఎఫ్ ఏ టు,ఎఫ్ ఎ త్రీ , పదవ తరగతి సిలబస్, వివిధ సబ్జెక్టు విషయాలతో పాటు ఉపాధ్యాయుల డైరీలు పరిశీలించి సంతృప్తి చెందారు.విద్యార్థులు ఈ సంవత్సరం 100 శాతం ఉత్తీర్ణులు అయ్యే విధంగా తగిన శ్రద్ధతో ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేసుకొని కృషి చేయాలని సూచించారు. కాగా 1999 -2000 సంవత్సరానికి చెందిన పదవ తరగతి విద్యార్థులు ఇటీవలే అందించిన డ్యూయల్ డిస్క్ బెంచీలను డీఈవో చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కోనేటి రవి, ఉపాధ్యాయులు కే అంజయ్య ,విజయలక్ష్మి, ప్రమోదిని, చింతల కనకయ్య ,శారదలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి స్థలం పరిశీలన

నవతెలంగాణ పటీ పల్లి



ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి గురువారం సూపరింటెండెంట్ సంగారెడ్డితో కలిసి మండల కేంద్రంలోని పశువుల సంతను హెల్త్ కమిషనర్ అజయ్ పరిశీలించారు. వెంటనే రిపోర్టు తయారు చేసి అందించాలని సూపరింటెండెంట్ సంగారెడ్డిని ఆదేశించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేష్ జోషి, మాజీ సర్పంచ్ సంగారెడ్డి హెల్త్ కమిషనర్ అజయ్, సూపరింటెండెంట్ సంగారెడ్డిని శాలువాలతో సన్మానించారు. మాజీ జెడ్పిటిసి పాపయ్య. మాజీ జెడ్పిటిసి రాంరెడ్డి.మాజీ ఎంపిటిసి శంకరప్ప. మాజీ సర్పంచ్ పటోళ్ల సంగారెడ్డి. గోపాల్ రెడ్డి. ఖర్చు రావు.శ్రీశైలం.యువ నాయకుడు స్టీఫెన్.తదితరులు ఉన్నారు.

ఫ్రీ జర్నీ తెచ్చిన తంటాలు

- 18 గంటల పనితో అలసిపోతున్నామంటున్న ఆర్టీసీ కార్మికులు
- డీఎం తీరును నిరసిస్తూ బస్‌డిపో ఎదుట కార్మికుల నిరసన



నవ తెలంగాణ- దుబ్బాక

ఆర్టీసీ అధికారులు తమతో 8 గంటలకు బదులుగా 18 గంటలు పని చేయిస్తున్నారని, దీంతో తమకు విశ్రాంతి లేక తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆరోపిస్తూ ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు గురువారం దుబ్బాకలోని బస్సు డిపో ఎదుట నిరసనకు దిగారు. గత పదేళ్లుగా సరిపడా డ్రైవర్లు లేక తీవ్ర ఇబ్బందులు వెల్లదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇతర డిపోల్లో ఇచ్చినట్లుగా తమకూ స్పెషల్ ఆఫ్,ఒక ఓటి ని ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.కాగా గురువారం ఉదయం టికెట్ ఇష్యు మిషన్ల లో సాంకేతిక లోపం తలెత్తింది.దీంతో కొన్ని సర్వీసులు ఆలస్యంగా ప్రారంభమైనట్టు ఆర్టీసీ కార్మికులు చెబుతున్నారు. డిపో మేనేజర్ వై.సుఖేందర్ రెడ్డిని వివరణ కోరగా దుబ్బాక బస్సు డిపోలో డ్రైవర్ల కొరత ఉన్న మాట వాస్తవమేనన్నారు. మహిళలకు ఉచిత బస్సు (ఫ్రీ జర్నీ) ప్రయాణం వల్ల ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లపై తీవ్ర ఒత్తిడి పడుతుందన్నారు. టికెట్ ఇష్యూ మిషన్లలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని, ఈ విషయాన్ని తమ ఉన్నతాధికారులకు నివేదించామని అన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాన భోజన కార్మికుల ధర్నా

నవతెలంగాణ-కంగ్టి



మండలకేంద్రమైన కంగ్టిలో గురువారం మధ్యాన భోజన కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షులు అతిమేల మాణిక్ మాట్లాడుతూ మధ్యాన భోజన కార్మికుల పెండింగ్ జీతాలు, బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ జుబేర్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వంట వండి పెడుతున్న వారికి గత ఏడు నెలలుగా బిల్లులు జీతాలు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం వండిపెడుతున్నా ప్రభుత్వం బిల్లులు చేయకపోవడంతో కార్మికులు అప్పులపాలయ్యారని అన్నారు. కొన్ని పాఠశాలల్లో ప్రధాన ఉపాధ్యాయులు కార్మికులను వేధిస్తున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వమే సరుకులు పంపిణీ చేయాలని అన్నారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కిందిదొడ్డి సతీష్, కెవిపిఎస్ మండల అధ్యక్షులు రాహుల్, ఎస్ఎఫ్ఐ మండల ఇన్చార్జ్ పవన్, యూనియన్ నాయకులు గంగామణి, శోభ, మోతిబాయి, లక్ష్మి, సంగమ్మ, సావిత్రి మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య



నవ తెలంగాణ ములుగు

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ములుగు మండలంలో చోటు చసుకుంది. ఎస్సై విజయ్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం... మండల పరిధిలోని వచ్చాయిపల్లి గ్రామానికి చెందిన నకిర్తి శ్యామల బుధవారం ఉదయం 7 గంటలకు ఇంటిలో నుంచి వెళ్లింది. నాగిరెడ్డిపల్లి గ్రామ శివారులో గల తునికి కలిసా వెళ్లే బీటీ రోడ్డు పక్కన నేరేడు చెట్టుకు ఊరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వెంకటేష్ కుటుంబ సభ్యులపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఖాళీ ప్రదేశాలలో చెత్త వేస్తే జరిమానా

నవతెలంగాణ-చేర్యాల



పట్టణంలోని ఖాళీ ప్రదేశాలలో చెత్త వేస్తే జరిమానా విధిస్తామని చేర్యాల మున్సిపల్ కమిషనర్ జి.రాజేంద్ర కుమార్ అన్నారు. గురువారం చేర్యాల పట్టణం లోని కెపీ ఆర్ కాలనీ లో గల ఖాళీ ప్రదేశాలలో వేసిన ప్లాస్టిక్, ఇతర చెత్త కొంత మేర ఏరి వేయడం జరిగిందని తెలిపారు. ప్రజలెవరూ కూడా ఖాళీ ప్రదేశాలలో చెత్త వేయకూడదని కోరారు. ఒకవేళ ఖాళీ ప్రదేశాలలో చెత్త వేసినట్లైతే వారికీ జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు.

యాసంగి పంటలను నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-కల్హేర్



యాసంగిలో సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేసుకోవాలని ఏడిఏ నూతన్ కుమార్ అన్నారు. మండలంలోని ఫతేపూర్ గ్రామంలో విస్తరణ అధికారి సతీష్‌తో కలిసి ఆయన పర్యటించి రైతులు సాగు చేసిన పంటలను గురువారం పరిశీలించారు. వ్యవసాయ అధికారుల వద్ద పంటల వివరాలను నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. అధికారి సతీష్, రైతులు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం

నవతెలంగాణ - గుమ్మడిదల



గుమ్మడిదల మండలం అన్నారం గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 261 అసైన్డ్ లావణ పట్టా భూముల్లో అక్రమంగా నిర్మించిన ఇండ్లను తహసీల్దార్ గంగాభవానీ ఆధ్వర్యంలో గురువారం జెసిబిల సహాయంతో కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం నుండి రైతులకు కేటాయించిన భూముల్లో పంటలు మాత్రమే సాగు చేయాలన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పట్టా సర్టిఫికెట్లు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంగీత రెవెన్యూ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రానికి స్థలం పరిశీలన

నవతెలంగాణ రాయికోడ్



మండలంలోని సింగీతం ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం కోసం స్థలాన్ని తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. సింగతంలో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనరసింహ నూతన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ఏర్పాటు చేస్తానని గత నెలలో గ్రామ పర్యటనలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు గ్రామంలో స్థల పరిశీలన చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి అంజయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నర్సింలు యూత్ అధ్యక్షులు ప్రభాకర్ సీనియర్ నాయకులు శశికాంత్ పాటిల్ నాయబ్ తహశీల్దార్ విజయ్ కుమార్,రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రభాకర్, సర్వేయార్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వంటేరుకు ఎంపీ టికెట్ కేటాయించండి

నవ తెలంగాణ -గజ్వేల్



తెలంగాణ ఫారెస్ట్ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డికి త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎంపీ టికెట్ కేటాయించాలని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మాజీ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకొచ్చారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్ అసెంబ్లీ స్థానం నుంచి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గెలిపించినందుకు గురువారం ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో అందరూ వంటేరుకు మెదక్ పార్లమెంటు స్థానం ఇచ్చి గజ్వేల్ నియోజకవర్గానికి ఇన్చార్జిగా ఇవ్వాలని తూప్రాన్ జెడ్పీటీసీ సత్యనారాయణ, మనోహరాబాద్ ఎంపీపీ నవనీత మహేష్, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. 1985 నుంచి వివిధ పార్టీలో పనిచేస్తూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాలు తెలిసిన వంటేరుకు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో సముచిత స్థానం కల్పించాలని కోరారు.

ఆర్టీసీకి మహాలక్ష్మి



- మహిళలకు ఉచిత ప్రయాణంతో మెదక్ రీజియన్‌కు పెరిగిన ఆదాయం
- గతంలో రోజూ 1.77 లక్షల మంది ప్రయాణం
- ఉచిత ప్రయాణంతో రోజుకు 2.86 లక్షలకు పెరిగిన ప్రయాణికులు
- మహాలక్ష్మి పథకంతో పెరిగిన ఆక్యుపెన్సీ
- డ్రైవర్, కండక్టర్లపై పెరిగిన పనిభారం
- కొత్త బస్సుల ఏర్పాటు.. రిక్రూట్‌మెంట్ వైపు అడుగులు
- ఉచిత ప్రయాణంతో పెరిగిన ప్రయాణికులు: ప్రభులత, ఆర్ఎం, మెదక్ రీజియన్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

అరకొర ఆదాయంతో నెట్టుకొస్తున్న ఆర్టీసీ సంస్థకు 'మహాలక్ష్మి' పథకం వరప్రసాదమైంది. మహిళలకు ఉచిత ప్రయాణ పథకం మొదలయ్యాక రోజువారిగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య దాదాపు రెట్టింపు అయ్యింది. అంటే ఆక్యుపెన్సీ పెరగడం ద్వారా మెదక్ రీజియన్‌కు ఆర్థిక పరిపుష్టి రానుంది. నగదు రూపాన ఏ రోజుకారోజు ఆదాయం రానప్పటికీ ప్రభుత్వం ఆర్టీసీ కార్పొరేషన్‌కు రియంబర్స్‌మెంట్ కింద దశల వారిగా బడ్జెట్ కేటాయించనుంది. ఉచిత ప్రయాణ సదుపాయం వల్ల మహిళలు సంతోషంగా ఉన్నారు. దూర ప్రయాణాలు భారం లేకుండా పోయింది. బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరగడం సంస్థకు లాభమైనప్పటికీ డ్రైవర్, కండక్టర్లపై పనిభారం పెరిగింది. అదనంగా కొత్త బస్సుల ఏర్పాటు, సిబ్బంది రిక్రూట్‌మెంట్ ద్వారా సమస్యల్ని అధిగమించాలని కార్పొరేషన్ భావిస్తుంది.

మెదక్ రీజియన్ పరిధిలో ఎనిమిది ఆర్టీసీ డిపోలున్నాయి. మెదక్, సిద్దిపేట, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, దుబ్బాక, నర్సాపూర్, సంగారెడ్డి, నారాయణఖేడ్, జహీరాబాద్ డిపోలున్నాయి. వీటి పరిధిలో 596 ఆర్టీసీ బస్సులున్నాయి. వీటిల్లో 353 పల్లెవెలుగు బస్సులుండగా మిగతావి ఎక్స్‌ప్రెస్ ఇతర బస్సులున్నాయి. మెదక్ రీజియన్ పరిధిలోని బస్సులు రోజూ రెండు లక్షలా 9 వేల కిలో మీటర్ల మేర ప్రయాణిస్తున్నాయి. వీటిల్లో మహాలక్ష్మి పథకం ప్రారంభానికి ముందు ప్రతి రోజూ లక్షా 77 వేల మంది ప్రయాణికులు మాత్రమే ప్రయాణించేది. డిసెంబర్ 9 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలు, థర్డ్ జెండర్స్‌కు ఉచిత ప్రయాణం పథకం ప్రారంభించడంతో ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది.



ఉచిత ప్రయాణంతో పెరిగిన ప్రయాణికులు

రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలు, థర్డ్‌జెండర్స్‌కు ఉచిత ప్రయాణం పథకం అమలు చేయడం వల్ల రోజువారి ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. మెదక్ రీజియన్ పరిధిలోని ఎనిమిది డిపోల్లో ఉచిత ప్రయాణం పథకం ప్రారంభం కాకముందు రోజువారిగా కేవలం లక్షా 77 వేల మంది మాత్రమే ప్రయాణించేది. గతేడాది డిసెంబర్ 9న రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించింది. సిటి బస్సులు, పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు, థర్డ్‌జెండర్స్ వయసుతో నిమిత్తం లేకుండా ఉచిత ప్రయాణం చేసే వెసులుబాటు కల్గింది. తెలంగాణ మహిళలకు మాత్రమే ఈ సదుపాయం వర్తిస్తుంది. ఈ నెల 17 మెదక్ రీజియన్ పరిధిలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికుల వివరాలను పరిశీలిస్తే... 17న 2 లక్షలా 86 వేలా 254 మంది ఆర్టీసీ బస్సులు ప్రయాణించారు. మెదక్ డిపో పరిధిలో 54213 మంది, సిద్దిపేట డిపో పరిధిలో 53859 మంది, సంగారెడ్డి డిపో పరిధిలో 49903 మంది, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో పరిధిలో 39223 మంది, జహీరాబాద్ డిపో పరిధిలో 34934, దుబ్బాక డిపో పరిధిలో 23876 మంది, నారాయణఖేడ్ డిపో పరిధిలో 17824, నర్సాపూర్ డిపో పరిధిలో 12422 మంది ప్రయాణికుల చొప్పున ప్రయాణించారు. ప్రతి రోజూ ఇదే పద్ధతిలో రీజియన్ పరిధిలో 2.80 లక్షల మంది ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణిస్తున్నట్లు ఆర్టీసీ రికార్డులు పేర్కొంటున్నాయి.

పెరిగిన ఆక్యుపెన్సీ

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన తర్వాత మెదక్ రీజియన్‌లో ఆక్యుపెన్సీ పెరిగింది. అంటే ప్రయాణికుల సంఖ్య రోజు వారిగా లక్ష వరకు పెరిగారు. దీంతో ఆ మేరకు సంస్థకు ఆదాయం కూడా పెరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. ఉచిత ప్రయాణ పథకం అమల్లోకి వచ్చాక రోజుకు లక్ష మంది ప్రయాణికులు అదనంగా బస్సుల్లో తిరుగుతున్నం దున గతంలో వచ్చిన ఆదాయం కంటే అదనంగా 75 శాతం వరకు వస్తుంది. రోజువారిగా బస్సులు ప్రయాణించే దూరం పెరగకపోయినప్పటికీ ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగినందున సంస్థకు ఆదాయం పెరిగిందనే చెప్పాలి. ప్రభుత్వం నుంచి రియంబర్స్‌మెంట్ రూపంలో ఉచిత ప్రయాణం కింద ఇస్తున్న జీరో టికెట్ల డబ్బులు రానున్నాయి.

సిబ్బందిపై పనిభారం.. బస్సుల ఇన్‌కమింగ్‌లో ఆలస్యం

ఉచిత ప్రయాణం వల్ల ప్రయాణికుల సంఖ్య పెరగడం వల్ల బస్సుల్లో రద్దీ పెరిగింది. ఏ బస్సు చూసినా ఫుల్‌గా ప్రయాణించాల్సి వస్తుంది. పల్లెవెలుగులు, సిటీ బస్సులు, ఎక్స్‌ప్రెస్‌లన్నీ కూడా నిండుగా నడుస్తున్నాయి. మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, జహీరాబాద్, నారాయణఖేడ్, దుబ్బాక, నర్సాపూర్ డిపోల పరిధిలో నడిచే బస్సుల్లో సీట్ల సంఖ్య కంటే రెండింతల మంది ప్రయాణిస్తున్నారు. ప్రతి స్టేజి, స్టాప్ వద్ద కూడా ప్రయాణికులు గుంపులుగా బస్సెక్కేందుకు ఎగబడుతున్నారు. వాళ్లందర్నీ పికప్ చేసుకోవాల్సి ఉండడంతో స్టాప్‌ల వద్ద ఎక్కువ సమయం పడుతుంది. దీంతో ఆయా రూట్లలో నడిచే బస్సుల ఇన్ కమింగ్ సమయం గంటన్నర నుంచి రెండు గంటల వరకు ఆలస్యమవుతోందని పలువురు సిబ్బంది పేర్కొంటున్నారు. ఆ మేరకు సిబ్బంది అదనంగా పనిచేయాల్సి వస్తుంది.

కొత్త బస్సుల ఏర్పాటు.. సిబ్బంది నియామకమే పరిష్కారం

మహిళలకు ఫ్రీ జర్నీ సదుపాయంతో బస్సుల్లో రద్దీ పెరిగినందున అదనపు బస్సుల్ని నడపాల్సి ఉంది. ఆయా రూట్లల్లో ప్రస్తుతమున్న బస్సులు ప్రయాణికుల సంఖ్యకు సరిపోవట్లేదు. రద్దీ వల్ల టికెట్ తీసుకునే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్బందులు తొలగాలంటే రీజియన్ పరిదిలో ఉన్న ఆర్టీసీ, అద్దె బస్సులు 596లతో పాటు అలదనంగా 40 నుంచి 50 బస్సులైనా పెంచాలి. రీజియన్ పరిధిలో 2304 మంది డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది ఉన్నారు. వీరిపైన పని భారం పడుతున్నందున ఖాళీలను భర్తీ చేయాలి. కొత్త రిక్రూట్‌మెంట్ చేయడం ద్వారానే సిబ్బందిపై పని భారం తగ్గుతుందంటున్నారు.

మెదక్ రీజియన్‌లో 17న

డిపో	ప్రయాణికుల సంఖ్య
మెదక్	54213
సిద్దిపేట	53859
సంగారెడ్డి	49903
గజ్వేల్-ప్రజ్ఞాపూర్	39223
జహీరాబాద్	34934
దుబ్బాక	23876
నారాయణఖేడ్	17824
నర్సాపూర్	12422
మొత్తం	286254

లక్ష మంది ప్రయాణికులు పెరిగారు: ప్రభులత, ఆర్ఎం, మెదక్ రీజియన్



మహాలక్ష్మి పథకం ప్రారంభమయ్యాక రోజువారిగా లక్షమంది వరకు ప్రయాణికులు పెరిగారు. రీజియన్ పరిధిలో గతంలో 1.77 లక్షల మందే ప్రయాణించేంది. ప్రస్తుతం 2.86 లక్షల మంది వరకు ప్రయాణిస్తున్నారు. రీజియన్ పరిధిలో ఆక్యుపెన్సీ పెరగడం మంచి పరిణామం. అదనపు బస్సుల్ని సమకూర్చేందుకు కార్పొరేషన్ స్థాయిలో నిర్ణయం తీసుకుంటారు. సిబ్బందిపై పని భారం పడింది. కొత్త రిక్రూట్‌మెంట్ ద్వారా పని వత్తిడి తగ్గే అవకాశముంటది. మహిళలు పెద్ద ఎత్తున ఉచిత ప్రయాణాన్ని ఉపయోగించుకుంటున్నారు.

ఓటర్ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి



నవతెలంగాణ-సంగారెడ్డి

అర్హత గల ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలని, ఆయా అధికారులు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం సంబంధిత అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా పరిశ్రమలు, కళాశాలలలో ఓటర్ నమోదు, స్వీప్ కార్యక్రమాల నిర్వహణ పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ నమోదుపై ఆయా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓటర్ అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలన్నారు. పరిశ్రమలలో పనిచేస్తున్న అర్హత గల వర్కర్లను ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. పరిశ్రమలలోని ఓ ట ర్ అవేర్నెస్ ఫోరం ఇన్చార్జీలతో సమావేశాలు నిర్వహించి, ఫారం 6, 7, 8 లను అందజేయాలన్నారు. పరిశ్రమలలో హెచ్ఆర్ సమన్వయంతో ఇంకా ఓటర్ గా నమోదు కాని వారి వివరాలు తీసుకోవాలని, వారికి ఫారం 6 అందజేసి, ఓటరుగా నమోదయ్యేలా చైతన్య పరచాలన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో గల తహసిల్దారులు మరింత దృష్టి సారించాలని, ప్రతి పరిశ్రమలో ఎంతమంది కార్మికులు, సిబ్బంది ఉన్నారు? అందులో ఎంతమంది ఓటర్లుగా నమోదయ్యారు? ఇంకా ఓటరు జాబితాలో లేనివారు ఎంతమంది అన్న వివరాలను సేకరించి, నమోదు కానీ వారు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు.రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా కొత్తగా అర్హత గల వారిని ఫారం 6 లో ఓటరుగా నమోదు చేయించాలని, షిఫ్టింగ్ కోసం ఫారం 8 ద్వారా దరఖాస్తు చేయించాలన్నారు. అర్హులు తుది ఓటరు జాబితాలో వచ్చే విధంగా చూడాలన్నారు. అన్ని కళాశాలలలో స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.డిగ్రీ కాలేజీ వారిగా షెడ్యూల్ చేసి అర్హులైన విద్యార్థులందరూ వంద శాతం ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని, స్వీప్ కార్యక్రమాలలో భాగస్వాములను చేయాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, స్వీప్ నోడల్ అధికారి అఖిలేష్ రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం ప్రశాంత్, డిఆర్ఓ నగేష్, టి ఎస్ ఐ ఐ సి జోనల్ మేనేజర్, సంగారెడ్డి జహీరాబాద్ ఆర్డిఓలు, జహీరాబాద్, కంది, గుమ్మడిదల, జిన్నారం అమీన్పూర్, ఆర్ సిపూర్, పటాన్చెరు తహసిల్దార్లు, ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇది కృతజ్ఞత సభ కాదు.. మనోవేదన సభ

- కేసీఆర్ మూడు నెలలకోసారి గజ్వేల్‌లో కనిపించాలి
- పార్టీని గాలికి వదిలేశారు.. ప్రభుత్వాన్ని పట్టుకొని తిరిగారు
- అందుకే ఓటమి చవిచూశాం
- హరీష్ ముందు కార్యకర్తల ఆవేదన



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్‌లో గురువారం ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గెలుపు కృతజ్ఞత సభ కాదని, పార్టీ సీనియర్లు, ప్రజాప్రతినిధుల మాటలను బట్టి చూస్తే మనోవేదన సభగా మారింది. కృతజ్ఞత సభకు తెలంగాణ ఫారెస్ట్ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సభలో పలువురు నాయకులు కార్యకర్తలు బహిరంగంగా తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. కార్యకర్తలు, నాయకులు, సీనియర్లు పార్టీ అధిష్టానంపై కన్నెర్ర చేశారు. ప్రభుత్వం ఉందని కార్యకర్తలను, వారి కష్టసుఖాలను పట్టించుకోలేదన్నారు. కనీసం ప్రజాప్రతినిధిగా పార్టీ అధిష్టానం చూడలేకపోయిందన్నారు. తాను ఎన్నికై ఐదు సంవత్సరాలు అవుతున్నా ఈరోజే మైకు పట్టుకున్నట్టు తూప్రాన్ జెడ్పీటీసీ సత్యనారాయణ ఆవేదన చెందారు. అధికారంలో ఉన్నప్పుడు కనీసం విలువ ఇవ్వలేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక్క కార్యకర్తను, వారికి కష్టాలను పార్టీ అధిష్టానం పట్టించుకోలేదని రాష్ట్ర ఎంపీటీసీల వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ ఆవేశం చెందారు. పార్టీని గాలికి వదిలేశారని, సంస్థాగత ఎన్నికలు జరపలేదని, మండల అధ్యక్షుడు జిల్లా అధ్యక్షుడు ఇష్టారాజ్యంగా ప్రకటించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఉన్నప్పుడు ఒక కార్యకర్తను ఒక ప్రజాప్రతినిధిని కూడా చూడలేదని ఆయన అన్నారు. ఆర్థికంగా చాలా నష్టపోయామని అయినా పార్టీ అధిష్టానం ప్రభుత్వంలో ఉన్న పెద్దలు తమను ఖాతరు చేయలేదన్నారు. గజ్వేల్ నియోజకవర్గం నుంచి కేసీఆర్ గెలిచినప్పటికీ ప్రజలకు అందుబాటులో లేకపోవడం వలన కార్యకర్తలకు నాయకులు ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. రెండుసార్లు ప్రభుత్వము ఉన్న గజ్వేల్ నియోజకవర్గం కార్యకర్తలతో ప్రజాప్రతినిధులతో కలవలేకపోయారన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ మూడు నెలలకు ఒకసారి అన్న గజ్వేల్ కార్యకర్తలకు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మాజీ మంత్రి హరీష్ రావు కృషి చేయాలని దేవీ రవీందర్ బహిరంగంగా చెప్పుకొచ్చారు. కార్యకర్తలను నాయకులు పట్టించుకోకపోతే రానున్న అన్ని ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి కష్టాలు ఎదుర్కోక తప్పదు అన్నారు. వేదికపై ఉన్న చాలామంది నాయకులు మాట్లాడి తమతమ కష్టాలను ఇబ్బందులను హరీష్ రావు ముందు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 45 రోజులు కాకముందే చాలా గ్రామాల్లో కేసులు పెట్టిస్తున్నారని పోలీస్ స్టేషన్లో భారత రాష్ట్ర సమితి కార్యకర్తలను వేధిస్తున్నారన్నారు. వర్గల్ మండల కేంద్రంలో ముస్లిం సోదరులు ఉపాధి కోసం ఏర్పాటు చేసుకున్న పనుల విషయంలో కాంగ్రెస్ నాయకులు పట్టించుకోని కేసులు ముస్లిం మైనార్టీలు సభలో దృష్టికి తీసుకువచ్చారు. ములుగు, వర్గల్, కొండపాక, తూప్రాన్, మనోహరాబాద్, కుకునూరు పల్లి, జగదేవ్పూర్, గజ్వేల్ మండలాల లో కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు నిత్యం పోలీస్‌స్టేషన్లో చుట్టూ తిరుగుతూ పాత కక్షలు బయటకు తీస్తూ కేసులు పెట్టిస్తున్నారు అన్నారు. గత ప్రభుత్వంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కు తోపాటు ఇతర నియోజకవర్గ గ్రామాలకు 100 కోట్ల వరకు నిధులు మంజూరు చేసి ప్రొసిడింగ్ ఇచ్చారని వాటిని కాంగ్రెస్ నాయకులు నిలిపివేసినట్లు మాజీ మంత్రి హరీష్ రావు దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా పార్టీలో ఒకరిపై ఒకరు కక్షలు సాధింపు చర్యలు కొనసాగుతుందని వాటిని నివారించాలని ప్రజాప్రతినిధులు కోరారు.

సెల్ టవర్ మెటీరియల్ దొంగల ముఠా అరెస్టు

- 11 మంది నేరస్తులను గుర్తించిన పోలీసులు
- ఏడుగురి అరెస్టు, పరారీలో నలుగురు
- కామారెడ్డి, హైదరాబాద్ వాసులుగా గుర్తింపు
- మీడియాకు వివరాలు వెల్లడించిన ఎస్పీ బాలస్వామి

నవతెలంగాణ - మెదక్



సెల్ టవర్ల మెటీరియల్ దొంగలిస్తున్న ముఠాను మెదక్ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. గురువారం మెదక్ జిల్లా నూతన పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నేరస్తుల వివరాలను జిల్లా ఎస్పీ బాలస్వామి వెల్లడించారు. మెదక్ జిల్లా చేగుంట పోలీస్ స్టేషన్ కు సంబందించిన కేసులో నిందితులను పట్టుకుని విచారించగా మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలతో పాటు సైబరాబాద్ కమిషనరేట్ పరిదిలలో సెల్ టవర్లకు సంబంధించిన మెటీరియల్స్ దొంగతనాలకు పాల్పడ్డ నేరస్థులుగా గుర్తించడం జరిగిందన్నారు. గత సంవత్సరం సెప్టెంబర్ నెల చివరి వారంలో నేరస్థులు రామంతాపూర్ గ్రామ శివారులోని సెల్ టవర్ లకు సంబంధించిన మెటీరియల్స్ ఎయిర్ టెల్ (బేస్ బాండ్ యూనిట్) దొంగతనాలకు పాల్పడినారని, అంతటితో ఆగకుండా మెదక్ జిల్లాలో వరుసగా సెల్ టవర్లకు సంబంధించిన మెటీరియల్స్ ను దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. ఈ కేసును ఛాలెంజ్ గా తీసుకుని జిల్లా అదనపు ఎస్పి అడ్మిన్ ఎస్ మహేందర్, తుప్రాన్ డిఎస్పి యాదగిరి రెడ్డి ఆద్వర్యంలో జిల్లా సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా ఏర్పాటుచేసి నేరస్థులను పట్టుకోవడం జరిగిందన్నారు. ఇందులో ప్రదాన నేరస్థుడు కామారెడ్డి జిల్లా, నాగిరెడ్డిపేట మండలం, వెంకంపల్లి గ్రామ నివాసి, బొల్లారంలోని ఎంజి లాజిస్టిక్ లో ట్రాన్స్పోర్ట్ కోఆర్డినేటర్ మాసిని మహేష్ గా గుర్తించినట్లు తెలిపారు. జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశ్యంతో మహేష్ 11 మంది ముఠాగా ఏర్పడి సెల్ టవర్ లకు సంబందించిన బిబియు(బేస్ బాండ్ యూనిట్) దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. మహేష్ తో పాటు కామారెడ్డి జిల్లా, నాగిరెడ్డిపేట మండలం, తాండూర్ గ్రామ నివాసి కైదాపూర్ సంతోష్ రెడ్డి, గోవ్వూరి రత్నాకర్ రెడ్డి, కర్రోల్ల రాజా గౌడ్, బొల్లారం, రిసాల బజార్ కు చెందిన మైసని అనిల్, ముషీరాబాద్ బోలక్ పూర్ కు చెందిన మహమ్మద్ అఫ్రోజ్ పాషా, కామారెడ్డి జిల్లాకు చెందిన పగిడిపల్లి అశోక్ లను అరెస్టు చేయడం జరిగిందన్నారు. అలాగే మరో నలుగురు నేరస్తుల మేడ్చల్ కు చెందిన మైసని బాగులు, మైసని శేఖర్, మహమ్మద్ అబ్బు, చాంద్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. పై నేరస్తుల ఒక ముఠాగా ఏర్పడి 24 పోలీస్ స్టేషన్ ల పరిధిలో మొత్తం 26 నేరాలకు పాల్పడినట్లు తెలిపారు. మొత్తం 10 కేసులు నమోదు కాగా మరో 14 కేసులు నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. 7 రిసీవర్లను దొంగిలించబడినట్లు తెలిపారు. ఇందులో మొత్తం రూ. 25,00,000 ఆస్తి విలువ కాగా రూ.6,75,000 రికవరీ చేసినట్లు తెలిపారు. అలాగే హ్యుందాయ్ గ్రాండ్ %క్మీ%10, ఇన్నోవా కారు, బేలెనో కారు, హెూండా షైన్ బైక్, 7 మొబైల్ ఫోన్స్, 5 ఎయిర్ టెల్ (బేస్ బాండ్ యూనిట్) స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును రామాయంపేట సీఐ లక్ష్మి బాబు, చేగుంట ఎస్ఐ హరీష్, క్రైమ్ డిటెక్టివ్ అధికారులు, ఎఎస్ఐ రాంబాబు, హెడ్ కానిస్టేబుళ్ల శ్రీనివాస్, సత్తయ్య కానిస్టేబుళ్ల భాస్కర్, జె.మహేష్, రాజు, విట్టల్ వెంకటేష్ ఛేదించినట్లు తెలిపారు. కేసును ఛేదించిన సిబ్బందిని జిల్లా ఎస్పి అభినందించి రివార్డులు అందజేశారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

నవతెలంగాణ - పటాన్ చెరు

నియోజకవర్గంలో గత పది సంవత్సరా లుగా ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు ఆధునిక వసతులతో ప్రభుత్వ పాఠశాలల భవనాలను నిర్మిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్ చెరు మండలం ఘనపూర్ గ్రామంలో గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సహకారంతో నాలుగు కోట్ల 50 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాన్ని గురువారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో 10 సంవత్సరాల పాటు ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయడంతో పాటు మన ఊరు మనబడి ద్వారా విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని తెలిపారు.నియోజకవర్గ కేంద్రమైన పటాన్ చెరులో కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా ప్రభుత్వ విద్యాసంస్థలను ఏర్పాటు చేయడంతో పాటు పక్కా భవనాలను నిర్మించామని తెలిపారు. గ్రామాలలో ప్రభుత్వం, సి ఎస్ ఆర్ నిధులతో భవనాలు నిర్మించామని పేర్కొన్నారు.గత ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల మూలంగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో అడ్మిషన్ల కోసం సిఫార్సులు చేయించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు.ఘనాపూర్ గ్రామంలో నిర్మించిన నూతన ప్రభుత్వ పాఠశాల భవనంలో విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయులకు సూచించారు.నియోజకవర్గంలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 7వేల మంది విద్యార్థులకు వచ్చే నెల మొదటి వారంలో మోటివేషనలు క్లాసులు నిర్వహించబోతున్నామని తెలిపారు. దీంతోపాటు ప్రతి విద్యార్థికి పరీక్షా కిట్లు అందించబోతున్నట్లు చెప్పారు. పాఠశాలల అభివృద్ధికి గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సిఎస్ఆర్ ద్వారా నిధులు కేటాయించడం పట్ల సంస్థ యాజమాన్యానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సిఎస్ఆర్ విభాగం అధిపతి రఘురామన్, ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, జెడ్పిటిసి సుప్రజా వెంకట్ రెడ్డి, గ్రామ సర్పంచ్ కావ్య కాశిరెడ్డి, ఎంపీటీసీ నీనా చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ విఠలయ్య, ఎంఈఓ పిపి రాథోడ్, రాఘవేంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వర్ నాయక్, నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.



న్యాయవాదులకు క్రీడా పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-సంగారెడ్డి

గణతంత్ర దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు క్రీడలు నిర్వహించారు. క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు క్యారం ఆడి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యానికి తొలిమెట్టు క్రీడలు అన్నారు. క్రీడ మైదానం లో పరిచయం ఉన్న వారికి ఆసుపత్రులు ఆమడ దూరంలో ఉంటాయని అన్నారు. న్యాయవాదులు క్రీడల వ్యాయామానికి ప్రాధ్యానత ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ. విష్ణువర్ధన్ రెడ్డి, కృష్ణ, బాల్రాజ్ ,మాణిక్ రెడ్డి, శ్రీనివాస్, అరుణకుమారి, రాంరెడ్డి, దయాకర్ రెడ్డి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఓటువినియోగంపై 2కే రన్



నవతెలంగాణ - ఝరాసంగం

ఝరాసంగం మండల కేంద్రంలోని రెవెన్యూ, పంచాయతీరాజ్, మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, ఇందిరా క్రాంతి పథకం, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మండల ప్రజాపరిషత్ కార్యాలయం నుండి మండలంలోని ప్రధాన కూడలి వరకు అధికారులు ఓటు హక్కు వినియోగంపై గురువారం ర్యాలీ నిర్వహించారు. ప్రజాస్వామ్యాన్ని ముందుకు నడిపించాలంటే ఓటు అత్యంత కీలకమైందని అందుకు ఓటర్ మహాశయులు ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజేందర్ రెడ్డి, డిటి యాసీన్, సూపరింటెండెంట్ మారుతి విట్టోభా, ఆర్ ఐ రామారావు, ఏపీవో రాజ్ కుమార్, ఏపిఎం బాలక్రిష్ణ, ఉపాధ్యాయులు రామ్ చందర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మోడల్ ఆసుపత్రిగా జోగిపేట

- మరమ్మత్తుల కోసం రూ2.13 కోట్లతో ప్రతిపాదనలు
- ఆకస్మికంగా తనిఖీ
- రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్

నవతెలంగాణ-జోగిపేట

రాష్ట్రంలో మోడల్ ఆసుపత్రిగా జోగిపేట ఆసుపత్రిని తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ అన్నారు. గురువారం జోగిపేట ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు ఆసుపత్రిని ఆదేశాల మేరకు ఆసుపత్రిని పరిశీలించినట్లు ఆయన తెలిపారు. మంత్రి నియోజకవర్గంలో ఆసుపత్రి ఎలా ఉండాలో వైద్య సిబ్బందికి సూచించామని, రాష్ట్రంలోని మిగతా ఆసుపత్రిలో జోగిపేటను ఆదర్శంగా తీసుకునేలా వైద్య సేవలు అందించాలని అయన సూచించారు. ఆస్పత్రిలో ప్రహరీ గోడ, నూతన మార్చురీ భవనం, తాగునీరు తదితర మౌలిక వసతుల కోసం మంత్రి ఆదేశాల మేరకు రూ.2.13 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు. ఆసుపత్రిలో అన్ని వసతులు ఉన్నాయా? లేదా?అని స్థానిక సూపర్డెంట్ రమేష్ ను అడిగి తెలుసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. డాక్టర్లు వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం వహించకూడదని ఆయన హెచ్చరించారు.ఆసుపత్రిలో సిబ్బంది విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని అన్నారు. ఆస్పత్రిలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా శానిటేషన్ కార్మికులతో పనులు చేయించాలని ఆయన సూచించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో సంబంధిత కాంట్రాక్టర్ తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. జోగిపేట ఆసుపత్రి మంత్రి నియోజకవర్గం అన్న విషయాన్ని మరచి పోవద్దని ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రమేష్ కు సూచించారు. ఆస్పత్రిలో ఉద్యోగుల బయోమెట్రిక్ విధానం అమలులో ఉందా అని ఆయన అడిగారు. విధుల్లో ఉండే సిబ్బంది అటెండెన్స్ విషయంలో సీరియస్ గా ఉండాలని హెచ్చరించారు. ఆసుపత్రుల్లో మంజూరు ఉన్న పోస్టుల్లో



ఖాళీలను భర్తీ చేస్తామని ఆయన తెలిపారు. కొత్త పోస్టుల కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి మంజూరి అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట డిసిహెచ్ఎస్ సంగారెడ్డి, ఆస్పత్రి సూపర్డెంట్ రమేష్ తదితరులు ఉన్నారు.

క్రీడలకు వేదిక మైత్రి క్రీడా మైదానం

- మైత్రి ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



నవతెలంగాణ-పటాన్ చెరు

దశాబ్దాల చరిత్ర కలిగిన మైత్రి మైదానాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు పట్టణంలోని మైత్రి క్రీడా మైదానంలో గురువారం ఏర్పాటు చేసిన 34వ మైత్రి ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్ ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 34 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం క్రికెట్ పోటీలు నిర్వహిస్తూ క్రీడా రంగానికి అత్యధిక ప్రాధాన్యమిస్తున్న మైత్రి క్రికెట్ క్లబ్ ను ఆయన ప్రశంసించారు. ఇటీవల ఏడు కోట్ల 50 లక్షల రూపాయలు ఖర్చు చేసి మైత్రి క్రీడా మైదానాన్ని ఆధునిక వసతులతో ఆధునికరించామని తెలిపారు. ఏడాది పొడవునా వివిధ అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం కొద్దిసేపు క్రికెట్ ఆడి సందడి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నగేష్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ సపనా దేవ్, ఎస్సార్ గ్రూప్స్ ఎం డి లు కే. సత్యనారాయణ రెడ్డి, సి. సత్యనారాయణ రెడ్డి, ఎస్సార్ ట్రస్ట్ అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి,శ్రీధర్ చారి, పృథ్వీరాజ్, క్రికెట్ క్లబ్ సభ్యులు, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

దేవతల గుట్టను కాపాడాలని తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-ఐడిఏ బొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని దేవతల గుట్టను కాపాడాలంటూ జిన్నారం తహసీల్దార్‌కు గురువారం బీజేపీ నాయకులు వినతి పత్రం అందచేశారు. మున్సిపల్ పరిధిలోని సర్వే నెంబర్ 278లోని స్థలాన్ని కొన్ని సంవత్సరాల నుండి దేవతల గుట్టగా పరిగణిస్తారు. ఈ మధ్యకాలంలో ఆ స్థలంలో కొంతమంది చర్చి నిర్మాణం చేపడుతున్నారు. ఈ విషయంపై స్థానికుల ఫిర్యాదు మేరకు హుడా అధికారులు అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. కూల్చిన కొన్ని గంటల్లో ఆ స్థలంలో శిలువ ఏర్పాటు చేసి మళ్లీ కబ్జాకి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్ విలేకరులతో మాట్లాడుతూ దేవతల గుట్ట అని పిలువబడే స్థలంలో హిందూ దేవాలయలు నిర్మాణం చేపట్టాలి కానీ కొందరు అన్య మతస్తులు చర్చి లు నిర్మాణం చేపడుతున్నారు. అయితే అధికారులు వెంటనే స్పందించి దేవుళ్ళ గుట్టపై దేవాలయాలకు అనుమతులు ఇవ్వాలని కానీ వేరే మతస్తులకు ఎలాంటి నిర్మాణాలు జరుపకుండా చూడాలని అయన అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక నాయకులు దేవుళ్ళ గుట్టను కాపాడాల్సింది వదిలేసి చర్చి నిర్మాణానికి సహకరిస్తున్నారని, కొందరు వ్యక్తులు మా నాయకుడు టీ. రవీందర్ రెడ్డి మతకలహాలు సృష్టిస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఇది సమంజసం కాదని అన్నారు.ఈ విషయాన్ని అడ్డం పెట్టుకొని పోలీసులు కేసులు నమోదు చెయ్యాలని చూస్తున్నారని ఇప్పటికే పిలిచి బైండొవరు చేయడం ఎంత వరకు సమంజసం అని అయన ప్రశ్నించారు. ఇదే విషయంపై డిఎస్పి ని కలిసి తమ ఆవేదన వ్యక్తం చేసామని ఆయనకు పూర్తి వివరాలు తెలియచేశామని ప్రతాప్ రెడ్డి అన్నారు. అనంతరం టీ. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు కూల్చివేత జరిపిన అక్రమ నిర్మాణానికి నాకు ఎలాంటి సంబంధం లేదని, కొందరు వ్యక్తులు చర్చి నిర్మాణం చేపడుతుంటే డబ్బులు డిమాండ్ చేశానని చేస్తున్న ప్రచారం సరైనది కాదని, నేను భగవద్గీత పైన ప్రమాణం చేసి చెపుతున్న నేను ఎవరిని డబ్బులు డిమాండ్ చేయలేదు ఒకవేళ ఉంటే నిరూపించాలని డిమాండ్ చేశారు. అలాగే నాపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై పరువు నష్టం దావా వేస్తానని



అయన హెచ్చరించారు. అలాగే దేవుళ్ళ గుట్టపై హిందూ దేవాలయాలే నిర్మాణాలు చేపట్టాలని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు రాఘవేంద్ర రెడ్డి, రాజిరెడ్డి,రోహిత్ సింగ్, వివిధ ఆలయాల కమిటీ సభ్యులు వెంకటయ్య, గోపి, ఎల్లప్ప, వెంకట్, సతీష్ రెడ్డి, గణేష్, అంజి, కిరణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్షింతలు అందుకున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అయోధ్య శ్రీరామతీర్థ ట్రస్ట్ అధ్వర్యంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి ముందుగా అయోధ్య కండువా కప్పి సత్కరించారు. తదనంతరం అయోధ్య శ్రీరామతీర్థ ట్రస్ట్ అక్షింతలను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబరీష్, జగన్, శేఖర్, వీరేశం, ద్వారక రవి, వెంకటేశ్వర్లు, బొంగుల రవి, కౌన్సిలర్ విష్ణు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

11, 12న టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలు



నవతెలంగాణ-సంగారెడ్డి

ఫిబ్రవరి 11, 12వ తేదీలలో ఖమ్మంలో జరిగే టిపిటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలను సంగారెడ్డి జిల్లా నుండి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని, విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు వై. అశోక్ కుమార్ పిలుపు నిచ్చారు. జిల్లా అధ్యక్షులు నాగారం శ్రీనివాస్ అధ్యక్షతన సంగారెడ్డిలోని ఉపాధ్యాయ భవన్ లో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అశోక్ కుమార్ హాజరై మాట్లాడుతూ 1944 లో ఏర్పడిన ఎపిటీఎఫ్ ఏడున్నర దశాబ్దాలుగా విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంస్థాపరంగా , విద్యా వ్యాప్తికి ఐక్యవేదికల ద్వారా ఎన్నో ఉద్యమాలను నిర్వహించినదన్నారు. పేద పిల్లలకు ప్రాథమిక విద్య దక్కాలని, అందరికీ సమాన విద్య అందాలని ఎజెండాగా పనిజేసిందని అన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చాక ఆరు తారీకున వేతనాలు అందడం శుభసూచకంగా పేర్కొన్నారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగారం శ్రీనివాస్, అనుముల రాంచందర్ లు మాట్లాడుతూ సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లపై వేలాదిమంది ఉపాధ్యాయులతో, విద్యాభిమానులతో ఖమ్మం లో విద్యా మహాసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఫిబ్రవరిలో ఖమ్మంలో జరిగే విద్యా మహాసభలకు ఉపాధ్యాయులు, విద్యాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి పాఠశాలలో స్కావేంజర్లను నియమించాలని, మధ్యాహ్న భోజనంలో అందించే గుడ్డు ధరను ఏడూ రూపాయలకు పెంచాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, లక్ష్మయ్య యాదవ్, సోమశేఖర్, గోవింద్ రెడ్డి, నాగేశ్వర్, సునీతా ఖన్నా, జీవం రావ్, రాజారెడ్డి, భాస్కర్, ఉపాధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, నాసర్ పటేల్, బిచ్చయ్య, విజయ్ భాస్కర్, మర్రి ప్రశాంతి, పాండురంగారెడ్డి, దుర్గం నర్సింలు, అశోక్ కుమార్, మల్లికార్జున్, బాబు రావ్, రాంతీర్థ్ నర్సింలు, ఇర్షాద్, పుండరీకం, జగన్నాథం, చంద్రశేఖర్, సాయిలు చారి తదితరులు పాల్గొన్నారు.

ఖీజర్‌యాపై గోల్డ్ కప్ విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు



నవతెలంగా-జహీరాబాద్

ఈ నెల 7న ప్రారంభమైన ఖీజర్‌యాపై గోల్డ్ కప్ పోటీలు ఈ నెల 14న విజయవంతంగా ముగియడంపై ఖీజర్‌యాపై గోల్డ్ కప్ ఆహ్వాన కమిటీ చైర్మన్, అధికార ప్రతినిధి రాములు నేత, ఆహ్వాన కమిటీ వైస్ చైర్మన్ జహంగీర్ ఖురేషి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ గత నెల 14వ తేదీన జహీరాబాద్ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో 40 వెయ్యిల మంది అభిమానులు ప్రత్యక్షంగా, క్రిక్ హీరోస్ ద్వారా 3 లక్షల 90 వెయ్యిలకు పైగా, 30 వెయ్యిలకు పైగా ఎక్స్పర్ట్ లైవ్ ద్వారా తిలకించి దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద టొర్నీగా రికార్డు సాధించడం మాములు విషయం కాదని, జహీరాబాద్ చరిత్రలోనే ఇంత పెద్ద గోల్డ్ కప్ ఎప్పుడు జరగలేదని, గతంలో జరిగిన కౌన్సిలర్లకు ప్రాతినిథ్యం ఇవ్వలేదని, ఖిజర్ యాపై గోల్డ్ కప్ లో కౌన్సిలర్లకు ప్రాతినిధ్యం ఇవ్వడం జరిగిందని, చరిత్రలో మొదటిసారి ఖిజర్ యాపై గోల్డ్ కప్ టొర్నీలో ముఖ్య అతిధులు కులమతాలకు అతీతంగా ఆహ్వానించడం జరిగిందని, రెడ్డి సామాజిక వర్గం, ముదిరాజ్, గోల్లకుర్మ, ఆర్యవైశ్య జమతే ఇస్లామీయ, లింగాయత్ సమాజ్, గిరిజన నాయకులు, దళిత నాయకులు, రిటైర్ ఉద్యోగ సంఘం నాయకులు, ఉపాధ్యాయులను, వికలాంగులు, పాత్రికేయులను టొర్నీలో ముఖ్య అతిధులుగా ఆహ్వానించడం జరిగిందని, టొర్నమెంటులో ఉత్తర, దక్షిణ, తూర్పు, ఈశాన్య భారతదేశం నుంచి 16 జట్లు పాల్గొన్నాయని, అన్ని జట్లు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చినందున క్రీడాభిమానులకు ఒక పండగ లాంటి టొర్ని గడిచిందని, దూరం నుంచి టొర్నీలో పాల్గొన్న జట్లకు నిర్వాహకులు ఖిజర్ యాపై వసతి సౌకర్యం కల్పించడం జరిగిందని, రాబోయే టొర్నీలో మరిన్ని సౌకర్యాలు కల్పించి టోర్నమెంట్ ను జాతీయ స్థాయిలో చర్చ జరిగే విదంగా చూస్తామని, ఫైనల్ పోటీల్లో జెబి శేకపూర్ సిసి మరియు ధారసింగ్ ఎలెవన్ సిసి సంగారెడ్డి జట్ల మధ్య జరిగిన పోరు టొర్నికె ఆకర్షణగా నిలిచిందని, టొర్ని ఫైనల్ రోజు అల్ ఇండియా హజ్ కమిటీ మేంబర్ ఐజాజ్ హుస్సేన్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, స్థానిక పార్లమెంట్ సభ్యుడు బిబి పాటిల్, ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, కొన్నింటి మణిక్ రావు, జడ్పీ చైర్మన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్విర్ ల కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టొర్ని విజయవంతంగా ముగిసిన అనంతరం తమకు నిర్వాహకులు ఖిజర్ యపై ప్రతినిధులు తమకు సత్కరించటం తమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని ఆహ్వాన కమిటీ బాద్యులు, మాజీ కౌన్సిలర్లు రాములు నేత, జహంగీర్ ఖురేషి, మోతీరం రాథోడ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మోతీరం రాథోడ్, అబ్దుల్లా, జహంగీర్, మొహమ్మద్ యూనిస్, శివమూర్తి స్వామి, ఒమర్ అహేమద్, మాక్సుద్ అలీ, మహమ్మద్ ఆలీ, విజయ్ రాథోడ్, అజ్మత్ అలీ, పాషా, ఖాజా పటేల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నవ తెలంగాణ



నవతెలంగాణ-న్యాల్‌కల్

నవతెలంగాణ దినపత్రిక ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యలను వెలికి తీస్తోందని జహీరాబాద్ సీఐ నోముల వెంకటేష్, హద్నూర్ ఎస్ఐ రామానాయుడు అన్నారు. హద్నూర్ పోలీస్ స్టేషన్‌లో నవ తెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోలీసులు విజయ్, రాజు, రాజశేఖర్, సంగమేష్, జర్నలిస్ట్ సిద్దు, మల్లారెడ్డి, సందీప్, దత్తు ఉన్నారు.

వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన సదస్సు



నవతెలంగాణ-కల్హేర్

మండల కేంద్రమైన నిజాంపేట గ్రామంలోని రైతు వేదికలో జంబికుం ట, రాంరెడ్డీ పెట్, మునిగే పల్లి, మెగ్యా నాయక్ తం డా, బచేపల్లి, నాగ్దార్ గ్రామాల రైతులకు శ్రీ కేతకీ సంగమేశ్వర రైతు ఉత్పత్తి కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఎంసీఎక్స్ డెరివేటివ్స్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా, వ్యాపార అభివృద్ధి, హైదరాబాద్ వెంకట్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయదారులు రైతులు ఒక కమిటీగ ఏర్పడి వారు పండించే పంటలను వారి ఉత్పత్తులను ఏ పద్ధతిలో ఉత్పత్తి చేయాలనే దానిపై ప్రతి ఒక రైతు అవగాహన కలిగి ఉండాలని రైతులకు ప్రత్యేక అవగాహన సద్దస్సును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి రైతు కూడా ఒక కమిటీగా ఏర్పడి వారు సాగు చేసే పంటలను వారు ఉత్పత్తి చేసే ఉత్పత్తులను ఎక్కువగా ఏ విధంగా చేయాలని దానిపై రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఖేడ్ వైస్ ఎంపీపీ సాయి రెడ్డి, స్థానిక గ్రామ సర్పంచ్ జగదీశ్వర చారి, డిసిఎంఎస్ డైరెక్టర్ మాణిక్ రెడ్డి, సర్పంచ్ గంగారం, మాజీ సర్పంచ్ రఘుపతి రెడ్డి, లింగారెడ్డి, నరసింహారెడ్డి, అంజయ్య, కిష్టయ్య, గంగారెడ్డి,వెంకయ్య, పెంటయ్య, నవాజ్ రెడ్డి,జై రాములు, కృష్ణారెడ్డి, ఎఫ్ పిసి బృందం యాదవ రెడ్డీ, రాజ్ కుమార్, హన్మంతు, రవీందర్,ఏఈఓ వంశీ,తదితరులు పాల్గొన్నారు.

మీర్‌ఖాన్‌పేటలో ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



నవతెలంగాణ-కల్హేర్

పది రోజులుగా కొనసాగుతున్న ఎన్ పిఎల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ఫైనల్ మ్యాచ్ కల్హేర్ మానూర్ జట్ల ఆటతో ముగిసింది. కల్హేర్ మండలంలోని మీర్ ఖాన్ పేట గ్రామంలో వి హనుమంత్ రెడ్డి స్పాన్సర్ గా ఉండి, బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు ఎస్ యాకోబు, రాపర్తి సర్పంచ్ ఎం శ్రావణ్ కుమార్, అల్లి ఖాన్ పల్లి సర్పంచ్ తనయులు సీనియర్ రంజి క్రికెటర్ రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ పి ఎల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ఫైనల్ మ్యాచ్ తో ముగిసింది. ఈ ఫైనల్ మ్యాచ్‌లో కల్హేర్, మనూరు జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. వీరి మధ్య పోటీ పోరా హెూరీగా సాగి విజేతగా కల్హేరు జట్టు నిలిచింది. ఈ ఫైనల్ మ్యాచ్ విజేతలకు బహుమతులు మనీ ప్రైస్ అందజేయడానికి ముఖ్య అతిథిగా ఓబీసీ మోర్చా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ ఆలే భాస్కర్ మరియు వి హనుమంత రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గెలుపొందిన కల్హేర్ జట్టుకు మొదటి మనీ ప్రైస్ బహుమతి 30 వేల రూపాయల చెక్కును కెప్టెన్ రవి మరియు టీం సభ్యులకు అందజేశారు. రన్నరప్ గా నిలిచిన మానూర్ టీంకు రెండవ బహుమతి మనీ ప్రైస్ 15వేల చెక్కును కెప్టెన్ సంతు మరియు వైస్ కెప్టెన్ నరసింహకు టీం సభ్యులకు అందజేశారు. సిరీస్ బెస్ట్ బ్యాట్స్మెన్ గా సంతు నిలిచారు సిరీస్ బెస్ట్ బౌలర్గా జిన్నా నిలిచారు ఫైనల్ మ్యాచ్లో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ శ్రీనివాస్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆలే భాస్కర్ హనుమంత రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో క్రీడాకారులను ప్రోత్సహించాలని ఉద్దేశంతో ఇలాంటి క్రికెట్ టోర్నమెంట్ లను నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. గ్రామీణ ప్రాంత యువత కూడా అన్ని రంగాల్లో ఆటలలో ముందుకు వెళ్లేందుకు వారి ప్రతిభను కనబరుచుకుని నిరూపించుకునే చక్కటి అవకాశాన్ని ఇలాంటి టోర్నమెంట్ల ద్వారా జరుగుతుందన్నారు. అప్పటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రతి గ్రామానికి క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసిందన్నారు.గ్రామీణ ప్రాంతాలలో కూడా యువతి యువకులు ఆటలు ఆడి భవిష్యత్తు తరాలలో ఉన్నత స్థాయిలలో రాష్ట్రం తరపున దేశం తరపున ఆడాలని వారు ఆకాంక్షించారు. నిరుపేద క్రీడాకారులకు ఎల్లవేళలా అండగా ఉండి ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉన్నట్లు వారు తెలియజేశారు. అనంతరం మండల పార్టీ ఉపాధ్యక్షుడు యాకోబ్ రంజి ప్లేయర్ సీనియర్ క్రికెటర్ రవి రాపర్తి సర్పంచ్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ క్రికెట్ ఇంకా ఆడడానికి క్రీడాకారుల కొరకు తమకు మూడు గ్రామాల మధ్య ఒక క్రికెట్ మినీ స్టేడియాన్ని ప్రభుత్వం నుండి మంజూరు చేయించాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో మీరా?న్ పేట సీనియర్ క్రికెట్ ఆటగాళ్లు అన్నారావు పంతులు, అబ్రహంఎన్.యోహాన్, పాలరాజు, నవీన్ ,ఆనందం, సీమోన్, కుమ్మరి శ్రీకాంత్, కుద్దూస్ పటేల్, అమ్ము పటేల్,కిషోర్, ప్రముఖ రిపోర్టర్స్ సుదర్శన్, రమేష్ గౌడ్, రషీద్ ఖాన్, ప్రవీణ్, రాపర్తి లక్ష్మన్న పెంటయ్య,రాజు, తదితర క్రీడాకారులు, పాల్గొన్నారు,

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-పటాన్ చెరు

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకంలో మార్పులు చేస్తూ ప్రస్తుత కాంగ్రెస్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీకి అనుగుణంగా లక్ష రూపాయల చెక్కుతో పాటు తులం బంగారాన్ని వెంటనే అందించాలని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. గురువారం పటాన్ చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అమీన్పూర్, పటాన్ చెరు, రామచంద్రపురం మండలాల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన 20 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి పారదర్శకతతో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. 420 హామీలు అందించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేసే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, జెడ్పిటిసి సుప్రజా వెంకట్ రెడ్డి, కార్పోరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నగేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన సదస్సు



నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండల పరిధిలో ఖాజిపల్లి పారిశ్రామిక వాడలో గురువారం మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ జయప్రకాష్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం కాజీపల్లి పారిశ్రామిక వాడకు సంబంధించిన హేట్రో, మైలాన్, శ్రీరామ్ కెమ్, ఎస్ఎంఎస్, బేనోవా తో పపాటు వివిధ పరిశ్రమలకు చెందిన కార్మికులు, ఏ ఈ ఎస్ రవీందర్, ఏఈఈ గౌతమి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ జయప్రకాష్, నిర్వాహకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి పెట్టండి

నవతెలంగాణ-జిన్నారం

అభివృద్ధి పనుల పై దృష్టి సారించాలని జిన్నారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ రాములు అన్నారు. మండల కేంద్రమైన జిన్నారంలోని స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో గురువారం జిన్నారం మండల స్థాయి గ్రామపంచాయతీ సెక్రటరీల సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తులకు సంబంధించిన డేటా ఇంటర్ వివరాలను జాగ్రత్తగా ఉంచాలన్నారు. పల్లె ప్రగతి పనులను నిర్వహించాలని సూచించారు. నర్సరీల పెంపకం ఇతరత్రాపండ్లపై దృష్టి సాధించాలన్నారు. ప్రజా పనుల నిర్వహణలో వేగంగా స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాములు, ఎంపీ సంతోష్ , ఎంపీ ఓ రామ్మోహన్ పలువురు గ్రామపంచాయతీలో సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

గీతం అధ్యాపకుడు బుర్రా భాస్కర్‌కు డాక్టరేట్



నవతెలంగాణ-పటాన్‌చెరు

నాన్-సర్క్యులర్ జర్నల్ బేరింగ్ పనితీరుపై 'ఉపరితల ఆకృతి ప్రభావం' అనే అంశంపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించిన హైదరాబాద్, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ బుర్రా భాస్కర్‌ను డాక్టరేట్ వరించింది.

గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.సీతారామయ్య, ఉస్మానియా విశ్వవిద్యాలయం, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ పి.రమేష్ బాబు ఈ పరిశోధనను పర్యవేక్షించినట్టు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు.భాస్కర్ సమర్పించిన సిద్ధాంత వ్యాసం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్ డీ పట్టా సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హై దరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వి.ఆర్.శాస్త్రి, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీనివాస్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు ఈ సందర్భంగా ఆయనను అభినందించారు.

ఓటు హక్కును నమోదు చేసుకోవాలి



నవతెలంగాణ-కొండాపూర్: మండల కేంద్రంలో వివిధ ప్రభుత్వ రంగాల ఆధ్వర్యంలో ఓటు హక్కు నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అనిత మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాల్నారు. ఈనెల 20,21 తేదీలలో ప్రతి గ్రామంలలో బిఎల్ ఓ లు పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉంటారని, ఓటు హక్కుకొరకు వారిని సంప్రదించాలన్నారు. ఓటు హక్కు అవశ్యకత వివరించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వినయ్ కుమార్, ఎంపీడీవో మధులత, ఎంఈఓ బీమ్ సింగ్, వ్యవసాయ శాఖ అధికారి గణేష్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్ శ్యామల, ప్రభుత్వ జూనియర్ కళాశాల టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

3
నవతెలంగాణ
మెదక్
శుక్రవారం | 19 జనవరి 2024 | www.navatelangana.com

హరితహారం లక్ష్యాలను పూర్తిచేయాలి

● జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-మెదక్ : తెలంగాణకు హరితహారం క్రింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా చిత్తశుద్ధితో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో హరితహారం కార్యక్రమంపై అటవీ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ 2025-26 వార్షిక సంవత్సరాలలో వివిధ శాఖల ద్వారా మొక్కలు నాటుటకు లక్ష్యాలను నిర్దేశిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుగుసాగాలని కోరారు. అధికారులు లక్ష్యం సాధించాలనే తపనతో కాకుండా మనస్సు పెట్టి నాటిన ప్రతి మొక్క పాడవకుండా జీవించేలా చూడాలన్నారు. ఔషధ మొక్కలు, నీడనిచ్చే మొక్కలు, పూల మొక్కలు, రహదారుల వెంట పెద్ద మొక్కలు నాటాలన్నారు. 2024 సంవత్సరంలో 27 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, కాగా 2025 సంవత్సరంలో 25 లక్షల మొక్కలు నాటుటకు కార్యాచరణ రూపొందించామన్నారు. అదేవిధంగా 2026 నాటికి 25 లక్షల మొక్కలు నాటుటకు ఇప్పటి నుండే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో నీటిపారుదల క్రింద బండ్ ప్లాంటేషన్, అటవీ శాఖ పరిధిలో బ్లాక్ ప్లాంటేషన్, గ్రామ పంచాయతీలు, విద్యా సంస్థలు, వసతి గృహాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ సంస్థలలో ఖాళీ ప్రదేశాలను గుర్తించి మొక్కలు నాటాలన్నారు. ప్రధానంగా కరివేపాకు, మునగ, ఉసిరి, చింత, వెలగ వంటి మొక్కలతో పాటు తులసి, అలవీరా, రణపాల వంటి ఔషధ మొక్కలు నాటాలని కోతులు దరిచేరవన్నారు. కోతులు బయట సంచరించకుండా అటవీ లోపల పండ్ల మొక్కలు నాటాలన్నారు. యన్ఆర్జిఎస్ క్రింద రైతులు పండ్ల మొక్కలు నాటేలా ప్రోత్సహించాలని, ఆయిల్ ఫార్మ్‌ను ప్రోత్సహించాలన్నారు. పశువులకు గడ్డి కొరకు ప్లాంటేషన్ చేయాలన్నారు. గ్రామ పంచాయతీలలో అంతర్గత, బహిర్గత రహదారుల వెంట, మునిసిపల్ ప్రాంతాలలో మీడియన్‌లో పెద్ద మొక్కలతో పాటు అందమైన పూల మొక్కలు నాటాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలలో కిచెన్ గార్డెన్లతో పాటు మునగ చెట్లు నాటాలన్నారు. అదేవిధంగా మార్కెట్ యార్డు, క్వారీలు, ఆర్టీసీ, ట్రాన్స్కో, ఆర్డీఓ తదితర అన్ని కార్యాలయాల వద్ద పద్ధతి ప్రకారం మొక్కలు నాటాలన్నారు. చెట్లు కొట్టిన, తొలగించిన వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రమేష్ , జెడ్పీ సీఈఓ శైలేష్, జిల్లా అధికారులు శ్రీనివాస్, రవి ప్రసాద్, సాయిబాబా, ఎంపిడిఓలు, మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి జెడ్పీటీసీ ఆర్థిక సాయం

నవ తెలంగాణ-నర్సాపూర్



శివంపేట మండల పరిధిలోని గంగాయపల్లి గ్రామానికి చెందిన హరిజన వెంకటయ్య ఇటీవల మృతి చెందడంతో ఈ విషయం తెలుసుకున్న శివంపేట జడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా మృతుడి కుటుంబానికి ఐదువేల ఆర్థిక సాయం అందజేశారు. ఇట్టి డబ్బులను జడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా శనివారం గంగాయ పల్లి గ్రామ మాజీ సర్పంచ్ సాయిలు ద్వారా మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. మృతుడు కుటుంబ సభ్యులు పబ్బ మహేష్ గుప్తకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీశైలం తదితరులు ఉన్నారు.

మృతుని కుటుంబానికి మాజీ ఎంపీటీసీ ఆర్థిక సాయం

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని కల్వకుంట గ్రామానికి చెందిన గరిగే అంజయ్య (55) గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఇదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ చింతల స్వామి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడు అంజయ్య కొడుకు, ఇద్దరు కూతుర్లను స్వామి ఓదార్చి మనోధైర్యాన్ని కల్పించారు. గరిగే అంజయ్య వ్యక్తిగతంగా చాలా మంచి వ్యక్తి అని నిరుపేద కుటుంబమని గ్రహించి ఆర్థిక సాయం అందజేయడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు.

భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయంలో స్వచ్ తీర్థ్

నవతెలంగాణ సంగారెడ్డి



ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు స్వచ్ తీర్థ్ కార్యక్రమంలో భాగంగా గురువారం సంగారెడ్డి బీజేపీ పట్టణ అధ్యక్షులు ప్రసాది రవి శంకర్ అధ్వర్యంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయ పరిశుభ్రత చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు యం. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీ సూచన మేరకు ప్రతి ఒక్కరూ వారి స్వగృహం దగ్గర ఉన్న దేవాలయాలను పరిశుభ్రత చేసి జనవరి 22 అయోధ్య నగరంలో రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో,ప్రతి వాడలో ఉన్న దేవాలయాలలో ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేసుకొని సామూహికంగా భక్తితో వీక్షించాలని కోరారు. దేశ ప్రజలందరికి ఆ శ్రీ రాముని ఆశీసులు ఎప్పుడు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఏ. విష్ణువర్ధన్ రెడ్డి, కొండాపురం జగన్ ,యం విష్ణువర్ధన్ రెడ్డి , జిల్లా ఉపాధ్యక్షులు కౌన్సిలర్ నాయికోటి రమేష్ ,లక్ష్మి ,కృష్ణ గౌడ్,పోలీస్ శేకర్,చంద్రశేఖర్, సాయి కిరణ్ ,అవన్ కృష్ణ ,శ్రీకాంత్, పాల్గొన్నారు.

మల్లన్నసాగర్ నుంచి నీటిని విడుదల చేయాలి

సానుకూలంగా స్పందించిన మంత్రి కొండ సురేఖ
మూడు రోజుల్లో నీటిని విడుదల చేస్తామని హామీ
జిల్లా ఇన్చార్జి మంత్రికి కృతజ్ఞతలు
కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-తొగుట



సాగునీటి అవసరాల కోసం మల్లన్నసాగర్ రిజ ర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయాలని దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి మంత్రిని కోరారు. గురువారం మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి కొండా సురేఖకు దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్‌లో మంత్రి కొండాసురేఖను ఆమె నివాసంలో కలిసి తొగుట మండలం ఎల్లారెడ్డిపేట, బండారుపల్లి తదితర గ్రామాల్లో సాగునీటి అవసరాల కోసం మల్లన్నసాగర్ నుంచి నీటిని విడుదల చేయాలని కోరుతూ మంత్రి దృష్టికి తీసుక వెళ్లినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి మూడు, నాలుగు రోజుల్లో సాగునీరు విడుదలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. వారం రోజుల క్రితం ఎల్లారెడ్డిపేట గ్రామ రైతులు తనను కలిసి తమ పంట పొలాలకు యాసంగిలో సాగునీటి కొరత ఉందని, రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి మరింత పెరిగే అవకాశం ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. పంటలు ఎండిపోకుండా మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయించి తమకు న్యాయం చేయాలని కోరారన్నారు. రైతుల సమస్యను దృష్టిలో పెట్టుకొని జిల్లా ఇన్చార్జి మంత్రి కి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. మరో మూడు, నాలుగు రోజుల్లో నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారన్నారన్నారు. రైతుల సమస్యలకు స్పందించి నీటిని విడుదల చేస్తామని మంత్రి ప్రకటించడం పట్ల మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. దుబ్బాక ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి నియోజకవర్గ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. మంత్రిని కలిసిన వారిలో సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ తదితరులు ఉన్నారు.


ఓటు హక్కు ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ జోగిపేట



జోగిపేట నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో జిల్లా ఎన్నికల అధికారి ఆదేశానుసారం గురువారం స్వీఫ్ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధ్యాపకుల అధ్వర్యంలో నా ఓటు నా భవిష్యత్తు- ఓటు ఒక శక్తి" అనే అంశంపైన విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రమేష్ మాట్లాడుతూ విద్యార్థులకు ఓటు విశిష్టత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ .పి. అడవిరాజు అకాడమిక్ కోఆర్డినేటర్ ఏ. గోపాల్, ఎన్ ఎస్ ఎస్ ఎస్ యూనిట్స్ అధ్యాపకులు అనసూర్య, డాక్టర్. జి .పండరి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

బసంత్‌పూర్‌లో టోర్నమెంట్ ప్రారంభం



నవతెలంగాణ-న్యాల్‌కల్ : మండలంలోని బసంత్‌పూర్ గ్రామంలో బీఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి గురువారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ టోర్నమెంట్ యువకులకు ఎంతో ఉపయోగపడుతుందని మండలంలో ఉన్న యువకులు బీఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంటును ఆసక్తి ఉన్న యువకులు సద్వినియోగం చేసుకోవాల న్నారు టోర్నమెంట్ వారం రోజులు పాటు కొనసాగుతుందని టోర్నమెంట్‌కు అవసరమైన అన్నింటిని శ్రీనివాస్ రెడ్డి స్పాన్సర్ చేశారు. క్రికెట్ పోటీలో 22 జట్లు పాల్గొననున్నాయి. ప్రథమ బహుమతిగా విన్నర్‌కు రూ.20 వేలు, కప్పు, రన్నర్‌కు రూ.10 వేలు, కప్పును అందజేయనున్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బి. శ్రీనివాస్ రెడ్డి, అబ్బాస్, జగన్నాథ్ స్వామి, గోపాల్, నిర్వాహకులు జీవన్, జాన్, లాలప్ప ఉన్నారు.

మహిళ పోగొట్టుకున్న విలువైన వస్తువుల అందజేత

నవతెలంగాణ-మునిపల్లి : సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పోగొట్టుకున్న చరవాణితోపాటు విలువైన వస్తువులు ఇతర డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుని బాధితురాలికి అందజేసినట్టు మునిపల్లి ఎస్సై సురేష్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన కోహీర్ గ్రామానికి చెందిన నాగరాణి తన బ్యాగులో మొబైల్ ఫోను, కొంత నగదు వెండి ఉంగరం, కుంకుమ భరిణ, ఆధార్, పాన్ కార్డు, ఇతర డాక్యుమెంట్లు ఉండగా అట్టి బ్యాగు మర్చిపోయినట్టు గుర్తించారు. బ్యాగులోని చరవాణి ఆధారంగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సంబంధిత పత్రాలు, విలువైన వస్తువులను చరవాణిని గుర్తించి గురువారం బాధితురాలికి అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సకాలంలో చరవాణి విలువైన వస్తువులను గుర్తించి అందజేయడంలో సిఈఐఆర్ పోర్టల్ ఆపరేటర్ కానిస్టేబుల్ హనీఫ్ కృషిని ఆయన అభినందించారు.

ఓ వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-మునిపల్లి : మునిపల్లి మండలం మేళసంఘం గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమైనట్టు మునిపల్లి ఎస్సై సురేష్ పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే మండలంలోని మేళాసంఘం గ్రామానికి చెందిన మెట్టు నాగరాజు (30) ఈ నెల ఏడవ తేదీన ఇంటి నుంచి వెళ్లినాడు. గతంలో కూడా ఇలాగే రెండు మూడు సార్లు హైదరాబాద్ వెళ్లి రెండు మూడు రోజుల తర్వాత తిరిగి వచ్చేవాడు. రెండు మూడు రోజుల్లో తిరిగివచ్చే భర్త ప్రస్తుతం పది రోజులు కావస్తున్న తిరిగి రాకపోవడంతో, అనుమానంతో భార్య ప్రియాంక బంధువులు, చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోయింది. నాగరాజు భార్య ప్రియాంక ఫిర్యాదు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సురేష్ పేర్కొన్నారు.

20, 21న ప్రత్యేక ఓటరు నమోదు శిబిరం

● జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-మెదక్

ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఈ నెల 20, 21వ తేదీ శని, ఆదివారాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపిడివోలు, మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 20, 21 తేదీలో శని, ఆదివారాలలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక ఓటరు నమోదు శిబిరం గురించి గ్రామాలలో చాటింపు వేసి ప్రచారం చేయాలన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు శిబిరం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలలో బిఎల్ఓ లు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. 1 జనవరి 2024కు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, సరైన గుర్తింపు కార్డు తీసుకొని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. ఓటరుగా నమోదు చేసుకున్నవారు చిరునామా మార్పు, ఫోటో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని, మరణించిన వారి వివరాలు తొలగించాలన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో ఫామ్ 6,7,8 అందుబాటులో ఉన్నాయన్నారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని వారు దగ్గరలోని ఎమ్మార్వో, ఆర్డీఓ కార్యాలయాల్లో నమోదు చేసుకోవచ్చన్నారు. ఓటరుగా నమోదు కావడానికి ఇదే చివరి అవకాశమని, జిల్లా ప్రజలు ఈ ప్రత్యేక ఓటరు నమోదు శిబిరంను వినియోగించుకోవాలని తెలిపారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024ను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేష్, డీఆర్డిఓ శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, జిల్లా అటవీ అధికారి రవి ప్రసాద్, ఎంపిడిఓలు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బఫర్ జోన్ పరిధిలో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు

● ఇరిగేషన్ డిఈ రాజేందర్ రావ్

నవతెలంగాణ-చేగుంట





నీళ్లు పారే ఏరియా కల్వర్టులకు అడ్డంగా (బఫర్ జోన్) వాటి పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చట్టరీత్యా చర్యలు తప్పవని ఇరిగేషన్ డీఈ రాజేందర్ రావు హెచ్చరించారు. చేగుంట పట్టణ కేంద్రం మక్కా రాజుపేట రోడ్‌లో కల్వర్టు వద్ద ఇదే మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన మహిపాల్ రెడ్డి అనే వ్యక్తి అక్రమ నిర్మాణం చేపట్టాడని, ఈ నిర్మాణం వల్ల వర్షాకాలంలో అలుగు పారి ఇబ్బందులు తలెత్తి నీరంతా నిలిచిపోయి ఎస్సీ కాలనీ ఇండ్లలోకి నీళ్లు చేరి ఇండ్లు కూలిపోయే ప్రమాదం ఉన్నందున, పట్టణానికి చెందిన కాలనీవాసులు స్టాలిన్ నర్సింలుతోపాటు మరికొందరు గ్రామపంచాయతీ ఈవోకు, సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేయగా పంచాయతీ కార్యదర్శి నాగభూషణం, మైపాల్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. గురువారం ఇరిగేషన్ అధికారి ఏఈ మమత, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది అక్రమ నిర్మాణ పనులు పరిశీలించి, మహిపాల్ రెడ్డికి కల్వర్టు వద్ద నిర్మాణాలు చేపట్టొద్దని, ఈ కాలువ సుమారు 10 మీటర్ల కంటే ఎక్కువ వెడల్పుగా ఉన్నందున, దీనికి తొమ్మిది మీటర్ల దగ్గరలో నిర్మాణం చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్మాణం చేపట్టిన స్థలంలో వ్యవసాయ పంటలకు తప్ప, ఎటువంటి నిర్మాణాలకు చోటు ఉండదన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు, కుంటలు నీళ్లు పారే ఏరియాలో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని, ఎవరైనా నిర్మాణాలు చేపట్టే ముందు ఇరిగేషన్ అధికారుల నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. ఇప్పటికీ కొంతమంది నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు తీసుకోలేదని, కేవలం గ్రామపంచాయతీ పర్మిషన్ తీసుకొని ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని, త్వరలోనే పై అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ మమత, ఆర్ఐ యాదగిరి యాదవ్, సర్వేర్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ విధానంపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-చేగుంట



వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా చేగుంట మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు బ్యాంకింగ్ విధానంపై అవగాహన కల్పించారు. ఎస్‌బిఐ డిప్యూటీ మేనేజర్ మోహన్ మాట్లాడుతూ బ్యాంకింగ్ విధానం, సుకన్య సమృద్ధి యోజన, ప్రప్రమాద బీమా, జీవనజ్యోతి బీమా యోజన, సేవింగ్ అకౌంట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చేగుంట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు నీరజ, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, రాజేశ్వర్, వెంకటేష్, రాథోడ్, చక్రధర్ శర్మ, సుధాకర్ రెడ్డి, శారదా, ఈశ్వరయ్య, శ్రీవాణి పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఆర్డీవో శ్రీనివాసులు

నవ తెలంగాణ-నర్సాపూర్

ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ నెల 20, 21 తేదీలలో నియోజకవర్గంలోని ఆయా గ్రామాలలో బూత్ లెవెల్ అధికారులు పోలింగ్ బూత్‌ల యందు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. 2024 జనవరి 1వ తేది నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఫారం 6 ద్వారా వారి పేర్లను బూత్ లెవల్ అధికారుల వద్ద ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఫారం 7 ద్వారా మరణించిన వారి పేర్లను, డబుల్‌గా పేర్లు నమోదు అయిన వారి పేర్లను తొలగించుకోవాలన్నారు. ఫారం 8 ద్వారా పేర్లలో ఫోటో సవరణలు, చిరునామా మార్పులను, దివ్యాంగుల గుర్తింపు మొబైల్ నెంబర్ అప్డేట్ చేసుకోవాలని, ఒక పోలింగ్ బూత్ నుంచి మరొక పోలింగ్ బూత్‌కు మార్చుటకు సవరణలు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నేటి నుంచి మూడు రోజులపాటు ఉర్సు ఉత్సవాలు

నవ తెలంగాణ-నర్సాపూర్



నర్సాపూర్ మండల పరిధి లోని నారాయణపూర్ గ్రామం లోని హజ్రత్ సయ్యద్ లాల్ షా క్యాద్రి ఉర్సు మౌలా బాబా దర్గా మొదటి వార్షికోత్సవంలో భాగంగా మూడు రోజులపాటు ఉర్సు ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. నారాయణపూర్ సర్పంచ్ ఇస్రాత్ ఫాతిమా అబ్బు బాయ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఈ ఉర్సు ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డితో పాటు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హను మంతరావులు వస్తున్నారని సర్పంచ్ ఇస్రాత్ ఫాతిమా అబ్బు బాయ్ తెలిపారు. ఈ ఉత్సవాలకు గ్రామ ప్రజలతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ ఉత్సవాలకు వచ్చే ప్రజలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆజం భాయ్, అబ్బు బాయ్, బాబా బాయ్, కాశీద్ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-మెదక్

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ స్థాయిలో గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి, గ్రామ ప్రజల భాగస్వామ్యంతో, గ్రామ సభలు ఏర్పాటుచేసి గ్రామ సభల ద్వారా గ్రామ అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. గ్రామ ప్రణాళికలు 3 విధానాల్లో గ్రామ, మండల, జిల్లా స్థాయిలో తయారు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు జనవరి 27 లోపు తయారు చేసి జనవరి 31 వరకు ఈ గ్రామ్ స్వరాజ్ యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. గ్రామ పంచాయతీలో పేదరికం, ఆరోగ్యం, పరిశుభ్రత, సుపరిపాలన, బాలబాలికల సంరక్షణ, మహిళ సాధికారతలపై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రజలకు మిషన్ భగీరథ నీటి సమస్య రాకుండా చూడాలని, ఉపాధి హామీ పథకంలో పనులు మొదలు చేయాలని, కూలీలకు పని కల్పించాలని, ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డ్ ఉన్న ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కూలీల డబ్బులు త్వరగా చెల్లించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేష్, జెడ్పీ సీఈఓ శైలేష్, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబ, జిల్లా అటవీ అధికారి రవి ప్రసాద్, ఎంపిడిఓలు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక, మట్టి అక్రమ తరలింపుదార్లపై కఠిన చర్యలు

తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి హెచ్చరిక

నవతెలంగాణ-వెల్దుర్తి



ఇసుక, మట్టి, దుబ్బ, అక్రమంగా తరలించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి హెచ్చరించారు. వెల్దుర్తి, మాసాయిపేట, మండలాల్లో కిలోమీటర్ల పొడవున హల్దీ వాగు పారడంతో పాటు వందల సంఖ్యలో వాగులు వంకలు ఉన్నాయన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా హల్దీ వాగు నుంచి కానీ హల్దీ వాగు పరిసర ప్రాంతాల్లో నుంచి దుబ్బ, మట్టి ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నారని, తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇక నుంచి ఎవరైనా భూగర్భ వనరుల శాఖ ద్వారా అనుమతి లేకుండా ఇసుక, మట్టి, దుబ్బ తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా ఒకటి రెండు సార్లు పట్టుబడితే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయడం జరుగుతుందన్నారు. చెరువులు, కుంటలు, వ్యవసాయ పొలాల నుంచి మట్టి, దుబ్బ తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు చేశామన్నారు. రోడ్లపై కేజీ విల్ ట్రాక్టర్లు నడిపితే వారిపైన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్లన్నీ ప్రజల ఆస్తులు కేజీ విల్ ట్రాక్టర్లు నడిపి రోడ్లను ధ్వంసం చేస్తే ప్రజల ఆస్తులు ధ్వంసం చేసిన చట్టం కింద కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ యాదగిరి రెడ్డి హెచ్చరించారు. ఎవరిని ఉపేక్షించేది లేదన్నారు.

ఇసుక, మట్టి అక్రమ తరలింపుదార్లపై కఠిన చర్యలు

పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ జెండా ఎగురవేస్తాం
బీఎస్పీ పార్లమెంట్ జోనల్ ఇంచార్జి సంజయ్ కుమార్

నవతెలంగాణ-కౌడిపల్లి



రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి బీఎస్పీ కార్యకర్త పని చేయాలని, పక్క ప్రణాళికతో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నామని పార్లమెంట్ జోనల్ ఇంచార్జి జక్కని సంజయ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రానున్న ఎన్నికల్లో నిర్వహించాల్సిన పలు అంశాలపై చర్చించారు. మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు అప్పాజి పల్లి సురేష్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ పార్లమెంట్ జోనల్ ఇంచార్జి జక్కని సంజయ్ కుమార్, పార్లమెంట్ ఇంచార్జి లింగంపల్లి యాదగిరి, సిద్దిపేట జిల్లా ఇంఛార్జి రోమండ్ల బాబు, మెదక్ జిల్లా ఇంచార్జి లక్ష్మి, అధ్యక్షులు కుతాడి నర్సింహులు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నటరాజు, పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీల, మండలాల కమిటీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీధర్ గుప్తా అరెస్టు రిమాండ్‌కు తరలింపు

ఎస్సై శివకుమార్

నవ తెలంగాణ-నర్సాపూర్

ప్రముఖ రైస్ మిల్లర్ పైడి శ్రీధర్ గుప్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై శివకుమార్ తెలిపారు. గురువారం నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శివకుమార్ విలేకరులతో మాట్లాడారు నర్సాపూర్ పట్టణానికి చెందిన పైడి శ్రీధర్ గుప్తా ప్రభుత్వం నుంచి వడ్లను తీసుకొని అందుకు సంబంధించిన రూ. 47 కోట్ల విలువగల బియ్యాన్ని ప్రభుత్వానికి అందజేయకుండా మోసం చేశారన్నారు. సివిల్ సప్లై కార్పొరేషన్ అధికారుల ఫిర్యాదు మేరకు శ్రీధర్ గుప్తపై కేసు నమోదు చేసి, అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నర్సాపూర్ : గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకుగాను గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గిరిజన విద్యాసంస్థల మెదక్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త ఎస్ సంపత్ కుమార్, స్థానిక గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ జె బిక్షమయ్యలు తెలిపారు. పట్టణంలోని గురుకుల కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ 2024-25 సంవత్సరానికి గాను ఎంపీసీ, బైపీసీలో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వారు తెలిపారు . ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న గిరిజన బాల బాలికలు ఎస్టీ విద్యార్థులు మాత్రమే అర్హులని వారు తెలిపారు. అభ్యర్థులు వెబ్సైట్ల ద్వారా 200 ఫీజు చెల్లించి ఫిబ్రవరి 5వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని వారు సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఈ కళాశాలలో ఇంటర్మీడియట్‌తో పాటు ఐఐటి, జేఈఈ, నీట్, ఎంసెట్ ఇతర ఉన్నత విద్యలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఘనంగా డాకూర్ సర్పంచ్ పూజా రమేష్ గౌడ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జోగిపేట

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమక్షంలో గురువారం అందోల్ మండల పరిధిలోని డాకూర్ గ్రామ సర్పంచ్ కళాలి పూజ రమేష్ గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డిలోని మంత్రి నివాసంలో ఆమె చేత కేక్ కట్ చేయించి పంచిపెట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంపతులు మంత్రికి ఫోటోతో కూడిన జ్ఞాపిక, పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ దంపతులను మంత్రి ఆశీర్వదించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ సర్పంచ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి దామోదర్ రాజనర్సింహ సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని, ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్సాని పల్లి పిఏసిఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ అజయ్, ఎంపిటిసి ప్రమీల, గ్రామ పెద్దలు మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సంజీవయ్య, మల్లేశం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో ఘనంగా జన్మదిన వేడుకలు



డాకూర్ గ్రామంలో సర్పంచ్ కలాలి పూజా రమేష్ గౌడ్ జన్మదిన సందర్భంగా గ్రామస్తులు ఆమె పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ సర్పంచిగా ఉత్తమ సేవలు అందిస్తున్నందున ఆయా పార్టీల నాయకులు, సామాజిక నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

మర్కుక్‌లో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-మర్కుక్

ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటోన్న ప్రజల కోసం మెడిసిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని మర్కుక్ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన మర్కుక్ పంచాయతీ కార్యాలయం దగ్గర మెడిసిడి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, కంటి పరీక్షలతో పాటు చెవి, ముక్కు, గొంతు, వరిబీజము, బీజకుట్టు, గడ్డలు, కనతులు, థైరాయిడ్ గడ్డలు,గర్భ సంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు చూసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో 110మందికి షుగర్, బీపీ, టెస్టులు చేశారు. ఆపరేషన్ అవసరము ఉన్న వాళ్ళ 30 మందిని రేపర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ భారతమ్మ, వార్డు సభ్యులు, డాక్టర్లు సామ్రాన్ సింగ్, యశ్వంత్ కుమార్, అబ్దుల్, శ్రావ్య మార్కెటింగ్ ఇంచార్జి కుమార స్వామి, నాగార్జున, అక్ష, తదితరులున్నారు.

నష్టం జరగకుండా ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి

నవతెలంగాణ-కొండపాక

ఔటర్ రింగ్ రోడ్డును గ్రామం బయట నుంచి కాకుండా ఇదివరకు ఉన్న రోడ్డు వెడల్పు చేస్తూ నిర్మాణం చేపట్టాలని కొండపాక మండలం దుద్దెడకు చెందిన పలువురు పేర్కొన్నారు. గురువారం గ్రామపంచాయతీ వద్ద ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణ పనుల విషయంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామం బయట నుంచి రోడ్డు నిర్మాణం చేపడితే ఎంతోమంది రైతుల భూములు కోల్పోవాల్సి వస్తుందని సభలో పాల్గొన్న వారంతా మూకుమ్మడిగా గ్రామం బయట నుంచి రోడ్డు అవసరం లేదని అధికారులకు తెలిపారు. ఇదివరకే ఎంతోమంది రైతులు తమ భూములను కోల్పోయారని మళ్ళీ రోడ్డు పేరుతో మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డును ప్రస్తుతం ఉన్న రోడ్డును వెడల్పు చేసుకుంటూ నిర్మాణం చేపట్టాలన్నారు. గ్రామం బయట నుంచి కాకుండా ప్రస్తుతం ఉన్న రోడ్డును వెడల్పు చేస్తూ నిర్మాణం చేపట్టాలని తీర్మానం చేసి తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఒకవేళ అలా కాదని గ్రామం బయట నుంచి రోడ్డును నిర్మాణం చేపడితే ప్రాణ త్యాగానికైనా సిద్ధమని వారు హెచ్చరించారు. వినతిపత్రం అందించిన వారిలో గ్రామ సర్పంచ్ ఆరేపల్లి మహదేవ్, తహసిల్దార్ శ్రీనివాస్, ఆర్ అండ్ బి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సాగర్ బాధితులను ఆదుకోవాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి



నవతెలంగాణ-గజ్వేల్

మల్లన్న సాగర్ బాధితులను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం మల్లన్న సాగర్ ప్రాజెక్టు కోసం భూసేకరణ చేసిన సమయంలో బాధితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఇల్లుకు ఇల్లు, బడికి బడి, గుడికి గుడి, ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకుంటామని హామీ ఇచ్చిందన్నారు. మాయమాటలు చెప్పి భూసేకరణ పూర్తి చేసి ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుండగానే గ్రామాలలోని కుటుంబాలను ఖాళీ చేయించిందన్నారు. బాధితులకు రావలసిన ప్యాకేజీలను అందరికి ఇవ్వకుండా ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. ఆ సందర్భంలో ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించి కొన్ని కుటుంబాలు కోర్టు ద్వారా న్యాయం కోసం వెళ్లగా న్యాయస్థానం వృద్ధులకు ఒంటరి మహిళలను కూడా కుటుంబాలుగా పరిగణించి వారికి రావలసిన పరిహారాలు ప్యాకేజీలు ఇవ్వాలన్నారు. వృద్ధులకు ఒంటరి మహిళలను కూడా కుటుంబాలుగా పరిగణించి వారికి రావలసిన పరిహారాలు ప్యాకేజీలు ఇవ్వాలని తీర్పు ఇవ్వడంతో ప్రభుత్వము మాటలు విని ప్రాజెక్టు కోసం సహకరించిన బాధితులకు ఇప్పటికీ న్యాయం జరగలేదన్నారు. ప్రభుత్వాలను అడిగిన ప్రతి సందర్భంలో త్వరలో న్యాయం చేస్తామని కాలయాపన చేశారని విమర్శించారు. ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ తరఫున అప్పటి సీఎం హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు నెరవేరలేదన్నారు. స్థానికంగా ముంపు గ్రామాల ప్రజాప్రతినిధుల మాటలు నమ్మి ప్రజా ప్రతినిధుల అధికారుల మధ్య సమన్వయం లేక అనేకమంది ముంపు గ్రామాల బాధితులు అన్యాయాలకు గురవుతున్నారని ఆయన ఆవేదన చెందారు. ప్రస్తుతం ప్రభుత్వము మారి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినందున ఇప్పటికైనా ముంపు గ్రామాలలో సమగ్ర సర్వే ద్వారా పరిహారాలు ప్యాకేజీలు రాని బాధితులను గుర్తించి అర్హులకు న్యాయం చేయాలన్నారు. అదేవిధంగా ముంపు గ్రామాల ప్రజలకు ఉపాధి అవకాశాల కోసం పరిశ్రమలు నెలకొల్పి అవకాశాలు ఇవ్వాలని, ఉపాధి హామీ పథకం ప్రారంభించాలని, నిరుద్యోగ యువతకు ప్రభుత్వ నియామకాలలో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన నిర్వాసితులకు ప్యాకేజీలు పరిహారాలు ఇవ్వని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

జాతీయస్థాయిలో జిల్లా కళాకారుడి ప్రతిభ



నవతెలంగాణ-సిద్దిపేట

మహారాష్ట్ర నాసిక్‌లో స్వామి వివేకానంద జయంతి పునస్కరించుకొని 27వ జాతీయ యువజన ఉత్సవాలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండల్ బంజేరుపల్లి గ్రామానికి చెందిన దుబ్బుల శివ జానపద పాటలలో నాలుగో స్థానంలో నిలిచి ప్రతిభను చాటారు. తెలంగాణ నుంచి జానపద పాట సోలో విభాగంలో ఉత్తమ ప్రతిభ కనపరచిన శివకు డి వై ఎస్ ఓ నాగేందర్, కళాకారులు స్వామి, విజయ్ భవాని, తిరుమలేష్, అర్జున్, భరత్, బంజేరుపల్లి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఓటమి బాధతో కాంగ్రెస్ నాయకులపై దాడి



నవతెలంగాణ-సిద్దిపేట

ఓటమి భాదతో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకులపై దాడి తగదనీ టీపీసీసీ మెంబర్ హలో దరిపల్లి చంద్రం, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ బొమ్మల యాదగిరి, సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేటలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ప్రతిపక్ష నాయకులు దాడి చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. వాహనాన్ని పక్కకు తీయాలని చెప్పినందుకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిపై బీఆర్ఎస్‌కు చెందిన ఓ నాయకుడు దాడి చేయడం బాధాకరమన్నారు. ఇలాంటి దాడి చేయడం పట్ల పట్టణ కాంగ్రెస్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పార్టీలో దాడులకు పాల్పడే విష సంస్కృతిని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు నేర్పించారన్నారు. బీఆర్ఎస్ పుట్టకముందే దేశాన్ని పాలించిన పెద్ద పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కండువా వేసుకుంటే దాడులు చేస్తామని బెదిరించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. బీఆర్ఎస్ ఓడిపోవడంతో ఆ ఓటమిని జీర్ణించుకోలేక కాంగ్రెస్ పార్టీ నాయకులపై దాడులు చేస్తున్నారని, దీనిని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. మరోసారి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై దాడి చేస్తే ఊరుకోమన్నారు. సకాలంలో స్పందించి కాంగ్రెస్ పార్టీ నాయకులకు అండగా నిలిచిన పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, నాయకులు గాదరి మదు, షాబుద్దీన్, కోలన్ నరేష్, గయాజుద్దీన్, నాజ్జ, అర్షద్, సలీం, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీకక్షకు ఏర్పాట్లు పూర్తి

- నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ డి.రాజేందర్



నవతెలంగాణ-వర్గల్

మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ ఎంపిక పరీక్షకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని ప్రిన్సిపాల్ డి. రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ విద్యాలయంలో 6వ తరగతిలో మొత్తం 80 సీట్లకు ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి 5796 మంది విద్యార్థులు పోటీ పడుతున్నారన్నారు. ఈనెల 20వ తేదీ శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు ప్రవేశ ఎంపిక పరీక్ష నిర్వహించనున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తము 29 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, సిద్దిపేట జిల్లాలోని 10 పరీక్షా కేంద్రాలలో 2182 మంది విద్యార్థులు, మెదక్ జిల్లాలోని 7 పరీక్ష కేంద్రాలలో 1501 మంది విద్యార్థులు, సంగారెడ్డి జిల్లాలోని 12 పరీక్ష కేంద్రాలలో 2113 మంది విద్యార్థులు పోటీ పడుతున్నారన్నారు. విద్యార్థులు నవోదయ వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకునే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందన్నారు. ఈనెల 18వ తేదీన నవోదయ ప్రవేశ ఎంపిక పరీక్ష నిర్వహణలో విధులు నిర్వహించే 29 మంది పరీక్ష కేంద్రాల పర్యవేక్షకులు, 29 మంది కేంద్ర పరిశీలకులు, ఇతర అధికారులకు మూడు జిల్లాల ప్రధాన కేంద్రాల్లో శిక్షణ ఇవ్వబడిందన్నారు. ప్రవేశ ఎంపిక పరీక్ష పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని వర్గల్ ప్రిన్సిపల్ పేర్కొన్నారు. రిజర్వేషన్, ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి తప్పనిసరిగా హాల్ టికెట్‌తో హాజరుకావాలని కోరారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

- అంతకపేట మాజీ సర్పంచ్ కొయ్యడ సృజన్ కుమార్



నవతెలంగాణ-అక్కన్నపేట

గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువకులు క్రీడలతో పాటు విద్యా, ఉపాధి అవకాశాల్లో రాణించాలని అంతకపేట మాజీ సర్పంచ్ కొయ్యడ సృజన్ కుమార్ తెలిపారు. సంక్రాంతిను పురస్కరించుకుని మండలంలోని అంతకపేట గ్రామంలో జరిగిన క్రికెట్ ప్రీమియం లీగ్ జూనియర్స్ టీమ్‌లకు గురువారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సృజన్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువకులు క్రీడలతో విద్యా, ఉద్యోగ అవకాశాలపై దృష్టి సారించాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి ఉపయోగపడతాయన్నారు. యువత నిత్యం సెల్ ఫోన్లతో కుస్తీ పడకుండా క్రీడల్లో పాల్గొని స్నేహ భావం పెంపొందించుకోవాలన్నారు. గెలుపు, ఓటములు సహజంగా ఉంటాయాని, గెలిచిన వారు పొంగిపోకుండా, ఒడినవారు కుంగి పోకుండా వచ్చిన గెలుపును అందరు పంచుకోవాలన్నారు. ఆటల్లో వైఫల్యాలను విజయాలుగా మలుచుకొని భవిష్యత్ విజయాలకు నాంది కావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు కాశబోయిన రవి, బీజేపీ నాయకులు రామంచ మహేందర్ రెడ్డి, గౌరవెల్లి ఉప సర్పంచ్ కొమ్ముల భాస్కర్ తో పాటు క్రికెట్ ప్రీమియం లీగ్ నిర్వాహకులు నాగిళ్ళ పవన్ శర్మ, కొయ్యడ క్రాంతి కుమార్, రాయిరెడ్డి మహేందర్ రెడ్డి, కంది అజయ్, పూదరి ప్రకాష్, నరేష్, సాంబ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల పదవీ కాలం పెంచాలి



నవతెలంగాణ-నంగునూరు

సర్పంచ్‌ల పదవి కాలం పెంచాలని నంగునూరు మండల సర్పంచులు గురువారం సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచులు తిప్పని రమేష్, చల్ల దశమంత రెడ్డి, భిక్షపతి నాయక్, శ్రీమంతుల వెంకటేశంలు మాట్లాడుతూ సర్పంచ్‌ల పదవి కాలం పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. స్పెషల్ ఆఫీసర్‌గా సర్పంచులనే కొనసాగించాలని పేర్కొన్నారు. కరోనా సమయంలోఎంతో నష్టపోయామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి అధికారి నిధులు (ఎస్. ఎఫ్.సి) 25 నెలల నుంచి రావడం లేదన్నారు. కేంద్ర ఆర్థిక అభివృద్ధి నిధులు (ఎస్.ఎఫ్.సి) పూర్తిగా 14 నెలలు రాలేదన్నారు. మిగతా సమయంలో ఆడపద డప జమ కావడం జరిగిందన్నారు. నెల నెలకు జమ అయ్యే నిధులు కాకపోవడం వలన చేసిన పనులకు బిల్లులు రాక, మెయింటనెన్స్ చేయుటకు కూడా నిధులు లేక మేము అప్పుగా తీసుకవచ్చి మా స్వంత నిధులతో తమ గ్రామ అభివృద్ధికి ఖర్చు చేయడం జరిగిందన్నారు. తేదీ 01.04.1994 నుంచి 31.03.1996 వరకు అప్పటి సర్పంచ్ లకు 2 సంవత్సరాల వరకు పర్సన్ ఇంచార్జ్‌గా పదవి కాలం పెంచారో అట్లే తమకు కూడా పెంచాలన్నారు. అదే విధంగా తమకు 8 నెలల పాటు చెక్ పవర్ అలస్యముగా వచ్చిందన్నారు. కరోనా కారణముగా తమ పదవి కాలము దాదాపు రెండు సంవత్సరాలు వృథా అయిందన్నారు. తమ పెండింగ్ నిధులు వచ్చే వరకు 2 సం"లు పదవి కాలం పెంచి తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ప్రధాని మోడీ పిలుపుతో స్వచ్ఛ భారత్



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు పట్టణంలోని ధోబిగల్లి రామాలయం వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారని సిద్దిపేట జిల్లా బీజేపీ అధ్యక్షులు దూది శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాలయం నీటితో కడిగి శుద్ధి, పరిసరాలు శుభ్రం చేశామని తెలిపారు. ఈనెల 22న అయోధ్యలో రామ మందిరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పత్రి శ్రీనివాస్ యాదవ్, కోడూరి నరేష్, బాసంగారి వెంకట్, అంబటిపల్లి శ్రీనివాస్, గోనె మార్కండేయులు, పాము పడిగే వేణుగోపాల్, సంతోష్, యాదన్ రావు, కృష్ణ, నగేష్, ఎల్లయ్య హేమంత్, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

మాజీ సీఎం ఎన్టీఆర్ సేవలు మరువలేనివి

నియోజకవర్గ ఇన్చార్జి బత్తుల శ్రీనివాస్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

మాజీ సీఎం నందమూరి తారక రామారావు ఉమ్మడి రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని టీడీసీ నియోజకవర్గ ఇన్చార్జి బత్తుల శ్రీనివాస్ అన్నారు. గురువారం హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో ఎన్టీ రామారావు 28వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు . ఎన్టీ రామారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఎన్టీ రామారావు ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టి ప్రజల మనసుల్లో నిలిచారన్నారు. పేదల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని, ప్రజల హృదయాలలో చెరగని ముద్రగా ఎన్టీ రామారావు నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పెరమండ్ల మల్లా గౌడ్, బత్తుల శంకర్, హసన్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



నవతెలంగాణ-కొండపాక

పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని కొండపాక ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ రజని తెలిపారు. గురువారం కొండపాక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రజనీ విద్యార్థులకు ఆరోగ్యం పై పలు సూచనలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకుంటే చదువుపై శ్రద్ధ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 125 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది శివ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా స్టాంపు పేపర్ల అమ్మకాలు

సబ్ రిజిస్టర్‌కు ఫిర్యాదు చేసిన నాయకులు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా స్టాంప్ పేపర్ల అమ్మకాలు జరుగుతున్నాయని గురువారం హుస్నాబాద్ సబ్ రిజిస్టర్‌కు వివిధ పార్టీల నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుస్నాబాద్‌లో పదిమంది స్టాంప్ వెండర్లు రూ.20, 50, 100 రూపాయలు, రూ.500 రూపాయల,10 రూపాయల టికెట్లను రూ. 30 రూపాయల అధిక ధరలతో ఇష్ట రాజ్యాంగ వసూలు చేస్తున్నారన్నారు. సబ్ రిజిస్టార్ దృష్టికి తీసుకేవెళ్ళినప్పటికీ అధిక ధరలకే అమ్ముతున్నారన్నారు. ధరల విషయమై విచారణ జరిపి స్టాంప్ వెండర్లపై తగు చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఎస్‌పి నాయకులు ఎలగందుల శంకర్, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్, బీఎస్పీ హుస్నాబాద్ మండల అధ్యక్షులు వేల్పుల రాజు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-చేర్యాల

రాజకీయ పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న చేర్యాల తహసీల్దార్ జోగినిపల్లి రాజేశ్వరరావుపై విచారణ జరిపి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) చేర్యాల పట్టణ, మండల కమిటీల బృందం గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్టను కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డితోపాటు నాయకులు ఈ నెల 13న పరిశీలన చేశారని, పరిశీలన సందర్భంగా తహసీల్దార్ వారితోపాటు పాల్గొన్నారన్నారు. చెరువు కట్ట సుందరీకరణ కోసం గతంలోనే రూ.2 కోట్ల 95 లక్షల నిధులతో ఐబి శాఖ చేపట్టిందని, చెరువు కట్ట పనులతో సంబంధం లేని తహశీల్దార్ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. రాజకీయాల కతీతంగా విధులు నిర్వహించాల్సిన తహసీల్దార్ రాజ్యాంగాన్ని ఉల్లంఘించడం జరిగిందని వినతిపత్రంలో పేర్కొన్నారు. మండలంలో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపి చట్టరీత్య చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ బృందంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్, చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు బండ కింది అరుణ్ కుమార్, చొప్పరి రవికుమార్, దాసరి ప్రశాంత్, మండల కమిటీ సభ్యులు దర్శనం రమేష్, పట్టణ కమిటీ నాయకులు రాళ్ల బండి చందు, ఆముదాల రంజిత్ రెడ్డి, నాయకులు తాటికొండ రవి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు..

ఎమ్మెల్సీల ఎంపిక పట్ల హర్షం

- యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్ ఖాన్



నవతెలంగాణ-గజ్వేల్

కష్టపడ ప్రతి కార్యకర్తను కాంగ్రెస్ గుర్తిస్తుందని అనుటకు ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక నిదర్శనమని యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్ ఖాన్ అన్నారు. గురువారం స్థానిక విలూకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్ పీసీసీ కార్యనిర్వహక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. అలాగే అధిష్టానానికి ప్రత్యేక కృతజ్ఞతలు చెపుతున్నామన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉండగా విద్యార్థుల సమస్యలపై ప్రజా సమస్యలపై ఆలు పెరగని పోరాటం చేశామన్నారు. గత ప్రభుత్వాన్ని అక్రమ కేసులు బనయించిన శారీరిక భౌతిక దాడులు చేసిన భయప డకుండా విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం పోరాటం చేసిందన్నారు. గత ప్రభుత్వంపై గలం ఎత్తి ఎన్నో ఉద్యమాలు నడిపిన విద్యార్థి నాయకుడు రాష్ట్ర అధ్యక్షులు బల్మూర్ వెంకట్‌ని ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం మాలాంటి విద్యార్థి యువజన కాంగ్రెస్‌లో పనిచేసిన కార్యకర్తలకు చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అలాగే విద్యార్థి నాయకుడిగా యువజన కాంగ్రెస్ నాయకుడిగా ప్రస్తుతం పీసీసీ కార్యనిర్వహక అధ్యక్షుడిగా పిసిసి, గాంధీభవన్ వ్యవహారాలను చూస్తూ పూర్తిస్థాయి పార్టీకి అంకితమైన బీసీ ముద్దుబిడ్డ మహేష్ కుమార్ గౌడ్‌ని ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పనిచేసే ప్రతి కార్యకర్తను గుర్తిస్తుందని విషయం తెలుస్తుందన్నారు. పార్టీ కోసం అహర్నిశలు పనిచేసే ప్రతి కార్యకర్తలకు పార్టీలో ప్రభుత్వంలో సముచిత స్థానం ఉండబోతుందని రుజువు అయిందన్నారు. ఈ కార్యక్రమంలో కొడకండ్ల బాలు, అహ్మదీపూర్ బాల గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 5
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
శుక్రవారం | 19 జనవరి 2024 | www.navatelangana.com

అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్న బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-మిరుదొడ్డి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు భూమా గౌడ్, సర్పంచ్ కిష్టయ్య అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లోనే 6 గ్యారంటీలో రెండు గ్యారెంటీలను అమలు చేయడం జరిగిందన్నారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీ ల అమలుకు కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ప్రజల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి ఆదరణ రావడంతో బీఆర్ఎస్ నాయకులు సహనాన్ని కోల్పోయి మాట్లాడడం జరుగుతుందన్నారు. అధికారంలోకి వచ్చి 100 రోజులు కాకముందే విమర్శలు చేయడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు అబద్ధపు ప్రచారాలు మానుకోవాలన్నారు.

ఎమ్మెల్సీ ఇచ్చి తీసుకోవడం విడ్డూరం



నవతెలంగాణ-గజ్వేల్

మాల మహానాడు జాతీయ అధ్యక్షులు అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవితో పాటు మంత్రి పదవి కూడా ఇవ్వాలని మాల మహానాడు జాతీయ నాయకులు తుమ్మ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ వ్యాప్తంగా పొలిటికల్ జేఏసీలో విస్తృతంగా పనిచేస్తూ తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున దయాకర్ తీసుకుపోయారని ఆయన గుర్తు చేశారు. దెబ్బలు తింటూ తెలంగాణ ప్రజల కోసమే తన రంతరం పోరాటం చేసిన వ్యక్తి డాక్టర్ అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చినట్లు ఇచ్చి మళ్లీ వెనక్కు తీసుకోవడం బాధాకరమన్నారు. అటు కాంగ్రెస్ పార్టీలో కూడా క్రియాశీలకంగా పార్టీ ఆదేశించిన క్రమంలో అనునిత్యం పనిచేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కోసం కూడా శ్రమించిన వ్యక్తి డాక్టర్ అద్దంకి దయాకర్ అని ఆయన అన్నారు. అతను చేసిన త్యాగం వృధా పోకుండా తాము ఉద్యమ ం చేపడతామన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలి

నవతెలంగాణ-తొగుట

మౌలిక సదుపాయాల నిర్మాణంతో దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు కేంద్రం వికాసత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టిందని ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. గురువారం మండలంలోని లింగాపూర్, యల్ బంజేర్ పల్లి గ్రామలలో వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల కోసం బ్యాంకు ఖాతా తీసుకోవడం ఎంతో అవసరం అన్నారు. బ్యాంకుల వల్ల ఉపయోగాలు, ఖాతాను ఎలా వాడాలి, కుటుంబ బడ్జెట్, వ్యక్తి బడ్జెట్, బ్యాంక్ ఖాతా రకాల గురించి వివరించారు. ఈ-కె వైసి, నామినీ ప్రాముఖ్యత, భీమా రకాలు, పీఎం ఎసిబివై (ప్రధానమంత్రి సురక్ష బీమా యోజ న)పిఎంజెజె బివై (ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన) ఏపీవై (అటల్ పెన్షన్ యోజన) ఎస్ఎస్బీవై (సురక్ష సమృద్ధి బీమా యోజన) ఉజ్వల, అయుష్మాన భారత్, విష్వకర్మా యొజన పలు మొదలగు భీమా రకాలు,రుణాలు, రైతులు పంట రుణాలు, ముద్రా రుణాలు, వ్యక్తిగత రుణాలు, డిజిటల్ లావాదేవీలు, రూపాయి ఎటిఎం కార్డ్ యుటిలిటీస్ గురించి తెలిపారు. వాటా, అంబుడస్మెన్ ప్రాముఖ్యత "రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా"ఆర్థిక అక్షరాస్యత శిబిరం యొక్క ప్రాముఖ్యత మొదలైన వాటి గురించి





వివరించి నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో వికసిత్ భారత్ మండల్ కోఆర్డినేటర్, చందాపూర్ సర్పంచ్ బొడ్డు నరసింహులు యాదవ్, లింగాపూర్ సర్పంచ్ బిక్క నూరి రజిత శ్రీశైలం యాదవ్, ఎల్ బంజేరుపల్లి సర్పంచ్ రాచకొండ మంజుల సత్యనారాయణ, యూనియన్ బ్యాంక్ మేనేజర్ దిలీప్ కుమార్, వైద్య అధికారి డాక్టర్ రాదకిషన్, ఆయుష్ డాక్టర్ సుభాషిని, హెల్త్ సూపర్వైజర్ శ్యామల, ఏఎస్ఎం రాములు, లక్ష్మి, వెటర్నరీ డాక్టర్ రాజేందర్ రెడ్డి, మత్స్య శాఖ అధికారి వంశీ, బీపిఎం నర్సింలు, వ్యవ సాయ అధికారి మోహన్, నవీన్ పంచాయితీ కార్య దర్శులు రాములు, బాలమణి ఉపసర్పచ్ లు చంద్రయ్య, పిట్ల నర్సింలు, వార్డు సభ్యులు, అంగన్ వాడి టీచర్లు,ఆశా కార్యకర్తలు, సిఎలు, ఎఫ్ఏలు, వివోలు, తొగుట సిఎఫ్ఎల్ కో ఆర్డినేటర్స్ బి. స్వామి. ఏ శ్రీనివాస్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



నవతెలంగాణ-దౌల్తాబాద్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ అయ్యాయ ని పాఠశాల ప్రిన్సిపాల్ టీఎస్ యజ్ఞశ్రీ తెలిపారు. ఆరవ తరగతిలో మొత్తం సీట్లకు ప్రవేశ పరీక్ష ఉంటు ందని 7, 8, 9 తరగ తులో వివిధ కారణాలతో వెళ్లిపో యిన విద్యా ర్థుల స్థానంలో ఖాళీ అయిన సీట్లను ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేసి భర్తీ చేస్తామని తెలిపారు. విద్యార్థులు దరఖాస్తులను ఈనెల 22వ తేదీ వరకు నేరుగా ఆదర్శ పాఠశాలలో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7వ తేదీన ఉంటుందని తెలిపారు.

గురుకులంలో 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-చేర్యాల

రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలలో 5వ తరగతి 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల జిల్లా కో ఆర్డినేటర్ బి.అశోక్ బాబు గురువారం తెలిపారు. విద్యార్థి తప్పనిసరిగా నాలుగో తరగతి 2023-24లో చదువుతూ ఉండాలని, ప్రవేశాలకు అన్ని కులాల వారు అర్హులేనన్నారు. ఎంపిక విధానం ప్రవేశ పరీక్ష మెరిట్ లిస్ట్ అధారంగా రిజర్వేషన్ ప్రకారం జరుగుతుందన్నారు. ప్రవేశ పరీక్షలలో మూడు, నాలుగు తరగతులలో తెలుగు, ఇంగ్లీష్, గణితం, మెంటల్ ఎబిలిటీ, పరిసరాల విజ్ఞానం అంశాల నుంచి ప్రశ్నలు ఆబ్జెక్టివ్ టైప్ రూపంలో వంద మార్కులకుగాను రెండు గంటల పరీక్ష ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉంటుందని పరీక్షకు ఆన్లైన్ వెబ్సైట్ ద్వారా ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

1000కి పైగా బిస్కెట్లతో రామ మందిరం



నవతెలంగాణ-గజ్వేల్

అయోధ్య రాముని గురించి భక్తులు అనేక రకాలుగా వేడుకుంటున్నారు. రాముని కోసం ఎదో చేయాలనే ఆలోచనతో పార్లిజీ, మ్యారీగోల్డ్ బిస్కెట్లను 1000కి పైగా ఉపయోగించి 3 రోజులు శ్రమించి భక్తితో మందిరాన్ని తయారు చేశారు. రామకోటి కార్యాలయంలో బిస్కెట్లతో రూపొందించిన చిన్నపాటి రామాలయాన్ని గురువారం రామకోటి రామరాజు ఆవిష్కరించి రామభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాముని గురించి ఎన్నో చిత్రాలు చిత్రించానని ఈ సారి రాముని గురించి మందిరాన్ని చేశానన్నారు. రామ నామాన్ని మించిన నామం మరొకటి లేదన్నారు. నేడు భారతదేశం అంతా కూడా రామనామంలో మునిగితెలడం రామభక్తికి నిదర్శనమన్నారు.

ఎస్టీ సెల్ మండల చైర్మన్‌గా రాథోడ్ వినోద్ కుమార్



నవతెలంగాణ-కోహిర్

కోహిర్ మండలంలోని పీచేర్యాగడి (ఎ) పాత తండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు రాథోడ్ వినోద్ కుమార్‌ను ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ కోహిర్ మండల ఎస్టీ సెల్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. బుధువారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జరిగిన ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో నియామక పత్రాన్ని ఆదివాసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా రాథోడ్ వినోద్ కుమార్ మాట్లాడుతూ కోహిర్ మండలంలోని పలు తాండలలో ప్రజలు అనుభవిస్తున్న సమస్యలపై ఎన్నో న్యాయ పోరాటాలు చేస్తూ.. సామాజిక ఉద్యమంలో పాల్గొంటూ ఎల్లప్పుడూ ప్రజా నాయకునిగా గుర్తింపు తెచ్చుకున్న సందర్భంగా ఆదివాసి కాంగ్రెస్ పార్టీ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్, జాతీయస్థాయి ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, ఫార్మర్ ప్రెసిడెంట్ రాహుల్ గాంధీ, నేషనల్ చైర్మన్ శివాజీ రావు మోగే, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క దృష్టికి తీసుకొచ్చి వివరించిన అనంతరం వారి ఆదేశాల మేరకు కోహిర్ మండల ఎస్టీ సేల్ చైర్మన్‌గా తనను నియమించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు సమయపాలన పాటించి పార్టీ కోసం పనిచేస్తానని హామీనిచ్చారు. ఎస్టీ సేల్ కోహిర్ మండల చైర్మన్ గా పదవికి సహకరించిన జిల్లా డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు ఎండి.ముల్తాని, మరియు యువజన కాంగ్రెస్ నాయకులకు,గిరిజన కాంగ్రెస్ నాయకులకు,కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ నియోజకవర్గ, నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలిపారు.

20న జాబ్ మేళా

నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వందన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎస్ బి ఐ లైఫ్ కంపెనీలో (160)ఉద్యోగాల భర్తీకి జనవరి 20న ఉదయం 11 గంటల నుండి 2 గంటల వరకు సంగారెడ్డి బైపాస్ రోడ్డులో గల పాత వెలుగు ఆఫీస్ లోని జిల్లా ఉపాధి కార్యాలయ ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.అభ్యర్థుల వయస్సు 18 నుండి 35 సంవత్సరాల లోపు ఉండాలని, ఎస్ఎస్ సి, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు.జీతం రూ. 15,000/- నుండి 45,000/- వరకు ఉంటుందని తెలిపారు.ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 20న నిర్ణీత సమయంలోగా తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, ఎస్ఎస్సీ మెమో, ఆధార్ కార్డ్, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులతో నేరుగా జాబ్ మేళాకు హాజరు కావాలని ఆమె సూచించారు.మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 08455-271010 లో సంప్రదించవచ్చని తెలిపారు.

అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

- మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన



నవతెలంగాణ-చేర్యాల

మాల మహానాడు జాతీయ అధ్యక్షులు అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని మాల మహానాడు ఆధ్వర్యంలో గురువారం చేర్యాల మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి బుట్టి సత్యనారాయణ మాట్లాడుతూ జాతీయ మాల మహానాడు అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్‌పై అగ్రవర్ణాలు కుట్రలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. అన్ని వర్గాలకు ముఖ్యంగా దళితులకు తీరని అన్యాయం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా రాష్ట్రంలో నేను క్షమాపణ చెప్పాలంటే ఒకే ఒక్కరికి అది అద్దంకి దయాకర్ కు మాత్రమే అని బహిరంగంగా ప్రకటించడం జరిగిందని గుర్తు చేశారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో రెడ్డి సామాజిక వర్గం సీనియర్ నాయకులందరూ కలిసి కుట్ర పన్ని అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోవడం, రెండు రోజుల క్రితం ఎమ్మెల్సీ పదవి ఇచ్చినట్లే ఇచ్చి గంటల వ్యవధుల్లోనే రద్దు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సీఎం, కాంగ్రెస్ పార్టీ పునరాలోచించి అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మంత్రి వర్గంలో చోటు కల్పించాలన్నారు. లేదంటే రాబోయే రోజుల్లో నిరసనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. జిల్లా కార్యదర్శి కమలాపురం కిష్టయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి మేడిపల్లి నరసింహ, డివిజన్ అధ్యక్షుడు చింతల విజయ్ కుమార్, విశ్రాంత ఉద్యోగస్తులు గుస్క రామదాసు ,పుట్ట యాదయ్య, బుట్టి భాగయ్య, పట్టణ అధ్యక్షులు పుట్ట రాజు, యూత్ నియోజకవర్గ అధ్యక్షులు పాకనాటి భాస్కర్, కల్లాటి సదేవులు పాల్గొన్నారు.

కస్తూర్బాగాంధీ పాఠశాలలో పోస్టుల ఖాళీలు

నవతెలంగాణ-వర్గల్

మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అటెండర్, నైట్ వాచ్ మెన్, పోస్టులు ఖాళీగా ఉన్నాయని స్పెషల్ ఆఫీసర్ రజిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైనవారు వర్గల్ కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు దరఖాస్తు చేసుకోవాలని దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదోతరగతి పూర్తయి ఉండాలని సూచించారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 25 వరకు చివరి తేదీ అని, అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ- గజ్వేల్

సిద్దిపేట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ నాన్ టీచింగ్ స్టాఫ్ సర్వసభ్య సమావేశం గజ్వేల్‌లో నిర్వహించారు. గురువారం ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకు న్నారు. ఈ కార్యక్రమంలో అనేక సమస్యలపై చర్చ నిర్వహించారు. సిద్దిపేట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ నాన్ టీచింగ్ స్టాఫ్ అధ్యక్షులుగా శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా వై. రాజు, కోశాధికారిగా చక్రవర్తి ఎన్నికయ్యారు. అదే విధంగా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

మైనార్టీ గురుకుల పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం



నవతెలంగాణ-గజ్వేల్

స్థానిక మైనారిటీ గురుకుల పాఠశాల కళాశాల గజ్వేల్ (బాలురు) అడ్మిషన్స్ కోసం అప్లికేషన్లు తీసుకుంటున్నామని ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 5వ ఇంటర్మీడియేట్ ఎంపీసీ, బైపిసి సీట్లు కోసం ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా విద్య, హాస్టల్ సౌకర్యం ఉందన్నారు. 5వ తరగతిలో 80 సీట్లు(51 ముస్లిం మైనారిటీ 5 క్రిస్టియన్ మైనారిటీ, బుద్ధ, పార్సీ, సిక్కు, జైన్ మైనారిటీలకి ఒక్కొక్క సీట్ ఓసి-2 బీసీ-10 ఎస్సీ-5 ఎస్టి-3) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ-40 బైపిసి 40 (28 ముస్లిం మైనారిటీ, 02 క్రైస్తవ మైనారిటీ, 05 బీసీ, 02 ఎస్సీ, 02 ఎస్టి ,01 ఓసి) ఉన్నాయన్నారు. పాఠశాలలో ఉచితంగా పుస్తకాలు, దుస్తులు, నోట్ పుస్తకాలు అందజేస్తున్నామన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటి దగ్గర నుంచే అప్లికేషన్ నింపవచ్చు న్నారు. లేదా పాఠశాలనీ సందర్శించి తమ అప్లికేషన్ నింపవచ్చన్నారు. అప్లికేషన్ నింపడానికి విద్యార్థి ఫోటో, ఆధార్ కార్డ్, విద్యార్థి తండ్రి ఆధార్ కార్డ్ తీసుకురావాలన్నారు. మరింత సమాచారం కోసం 7995057964, 9959542188, 7416071445 నంబర్లకు సంప్రదించాలన్నారు.

చిన్నారులకు ఉపాధ్యాయురాలి అండ



నవతెలంగాణ-గజ్వేల్

మండలంలోని కొల్గూర్ గ్రామంలో తల్లి తండ్రులు కన్ను మూయడంతో అనాథలుగా మిగిలిన చిన్నారులకు అహ్మదీపూర్ గ్రామానికి చెందిన సౌజన్య అనే ఉపాధ్యాయురాలు తన మిత్రులు సహాయంతో 14 వేల రూపాయలను ఆర్థిక సాయం అందించారు. మండల ప్రాదేశిక సభ్యురాలు గొడుగు జ్యోతి స్వామి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ నెంబర్ బాలకిషన్, మైసయ్య, డిచెందర్‌లు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు తప్పకుండా పాటించాలి

- హుస్నాబాద్ ఎంవీఐ జనార్ధన్ రెడ్డి



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు తప్పకుండా పాటించాలని హుస్నాబాద్ హుస్నాబాద్ ఎంవీఐ జనార్దన్ రెడ్డి వాహదారులకు సూచించారు గురువారం హుస్నాబాద్‌లో వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, సీట్ బెల్ట్, సెల్ ఫోన్, పరిమితికి మించి వేగంగా వెళ్లవద్దని సూచించారు. వాహనం నడిపేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పి అశోక్ కుమార్, టెక్నికల్ సపోర్ట్ ఇంజనీర్ చేతన్ కుమార్, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మ మహేష్ కుమార్‌ను కలిసిన ఖలీమొద్దీన్ అహ్మద్



నవతెలంగాణ-సిద్దిపేట

ఎమ్మెల్యే ఖోటలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నికైనా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశా నని టీపీసీసీ రాష్ట్ర మైనారిటీ ఉపా అధ్యక్షులు ఖలీం ఉద్దీన్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా బొమ్మ మహేష్‌కుమార్‌ను శాలువా, బొకేతో ఘనంగా సత్కరించారన్నారు.

రాష్ట్ర వ్యవసాయ అధికారుల క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-మర్కుక్

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం, క్యాలెండర్, డైరీనీ జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ బి.అనురాధ గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ మండల వ్యవసాయాదికారి డా.నాగేందర్ రెడ్డి, సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షులు ఎం. ప్రవీణ్ కుమార్, ప్రదానకార్యదర్శి టి. నాగేందర్ రెడ్డి, మోహన్, భోగేశ్వర, స్వామి, శేష శయన, గోవిందరాజు, గీత తదితరులున్నారు.

అనంతగిరి రిజర్వాయర్ నుంచి రంగనాయక సాగర్ నీరు





నవతెలంగాణ-సిద్దిపట కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం అనంతగిరి రిజర్వాయర్ నుంచి రంగనాయక సాగర్‌లోకి నీటిని పంపింగ్ చేయడం ప్రారంభమైందని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్ తెలిపారు. ఇంకా రేపు, ఎల్లుండి మొత్తం 1 టీఎంసీ నీటిని పంపింగ్ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అలాగే రంగనాయక సాగర్‌లోకి పంపింగ్ చేసిన నీటిని త్వరలోనే రైతుల సౌకర్యార్థం, యాసంగి పంట కాలానికి పంట నష్టపోకుండా పంటలు పండించుకునేందుకు కాల్వల ద్వారా పంట పొలాలకు సాగునీరు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

నవతెలంగాణ-చిన్నకోదూరు

యాసంగి పంటకు నీళ్ల లేక ఆందోళనలో ఉన్న రైతుల బాధను చూసి అజ్జు యాదవ్ ఇటీవల రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను స్వయంగా కలిసి సాగు నీరు విడుదల చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతగిరి రిజర్వాయర్ నుంచి రంగనాయక సాగర్‌లోకి నీటిని విడుదల చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రైతుల పక్షాన కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు అజ్జు యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. యాసంగి పంటకు నీళ్లు ఇవ్వాలని కోరగానే అధికారులతో చర్చించి నీటి పంపింగ్ చేయించారని, త్వరలోనే కుడి,ఎడమ కాలువల్లోకి నీళ్లు విడుదల చేస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు.

నవతెలంగాణ-సిద్దిపేట

అంతగిరి రిజర్వాయర్ నుంచి రంగనాయక సాగర్‌లోకి ఒక టీఎంసీ నీటిని విడుదల చేయడం హర్షణీయమని టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి దాస అంజయ్య అన్నారు. రైతుల కోసం రంగనాయక సాగర్‌లోకి నీటిని విడుదల



చేయాలని ఈ మధ్యనే మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి విన్నవించామన్నారు. ఆయన కృషి మేరకు నీరు విడుదల కావడం సంతోషంగా ఉందన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి రైతుల పట్ల ఉన్న ప్రేమకు ఇది నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతు, ప్రజా సంక్షేమ పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లేశం, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



నవతెలంగాణ నారాయణఖేడ్ రూరల్

నారాయణఖేడ్ జూనియర్ సివిల్ కోర్టు ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు చట్టాలపై అవగాహన బస్సుయాత్ర కార్యక్రమం గురువారం నిర్వహించారు. న్యాయవాదులు సాయిలు, జీవన్, కోర్టు సిబ్బంది సంజీవ్, శ్రీను, కృష్ణ ఆధ్వర్యంలో చట్టాలపై వివరించారు. వెంకటాపూర్, జూకల్ తండాలో కార్యక్రమం నిర్వహించారు.